

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 2 సంచిక : 22 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 29 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE : 22 PAGES : 8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : THADEPALLI GUDEM SUN 29 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

నేడు పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్..

పార్టీ ముఖ్యనేతలతో లోకేశ్ టెలీకాన్ఫరెన్స్



- రెండో విడత పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై లోకేశ్ సమీక్ష
- కూటమి బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపు
- కూటమి పార్టీల మధ్య పూర్తిస్థాయిలో ఓటు బదిలీ జరగాలని స్పష్టీకరణ
- రెబల్స్ అంశంపై స్థానిక నాయకత్వంతో చర్చించి పరిష్కరించాలని సూచన
- బాగా పనిచేసిన నాయకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో (నవంబరు 29) జరగనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ పార్టీ ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ గెలిపించేందుకు ప్రతిఒక్కరూ పూర్తి అంకితభావంతో పనిచేయాలని ఆయన కోరారు.ఇటీవల పట్టణ, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి తోడ్పడ్డాయని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల్లో కూటమి

- మిగతా 2లో



నాలుగు వ్యవస్థల బలంతోనే సంక్షోభాలను

అధిగమించాం!

- కేసుల పరిష్కారానికి లీగల్ ఏఐ స్టాక్: సీఎం చంద్రబాబు
- వచ్చే ఏడాది పోలవరం పూర్తి.. గోదావరి పుష్కరాలకు న్యాయమూర్తులకు ఆహ్వానం



పెన్ పవర్ డెస్క్: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటున్నా భారత్ మాత్రం స్థిరంగా ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి సంబంధించిన నాలుగు వ్యవస్థలు పటిష్ఠంగా పనిచేయడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడటంలో న్యాయవ్యవస్థతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవస్థ కూడా కీలక బాధ్యత నిర్వహిస్తోందని వివరించారు.తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222 ఏళ్లు,

- మిగతా 2లో

- రాజమండ్రి కోర్టు, బార్ అసోసియేషన్ చారిత్రక వేడుకల్లో చంద్రబాబు ప్రసంగం
- భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థల పటిష్ఠతపై సీఎం ప్రశంసలు
- కోర్టు కేసుల వేగవంతమైన పరిష్కారానికి లీగల్ ఏఐ స్టాక్
- ప్రత్యామ్నాయ విధానాల ద్వారానే సత్వర న్యాయం సాధ్యమని ఉద్ఘాటన
- అమరావతికి అండగా నిలిచిన హైకోర్టు తీర్పుల ప్రస్తావన
- వచ్చే ఏడాది పోలవరం పూర్తి, గోదావరి పుష్కరాల నిర్వహణ.. న్యాయమూర్తులకు ఆహ్వానం



స్కూల్ సమీపంలో భారీ పేలుడు..

ఏడుగురు విద్యార్థులు మృతి!

- 90 మందికి పైగా గాయాలు.. డైనమైట్ నిల్వే ప్రమాదానికి కారణమా?
- ఆఫ్ఘనిస్థాన్‌లోని కునార్ ప్రావిన్స్‌లో విషాద ఘటన

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు ప్రాంతంలోని కునార్ ప్రావిన్స్‌లో ఓ పాఠశాల సమీపంలో భారీ పేలుడు సంభవించడంతో ఏడుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో 97 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో పలువురు చిన్నారులు ఉన్నారు. శనివారం (నవంబర్ 28) ఉదయం ఈ విషాద ఘటన జరిగింది.

మైనింగ్ పేలుడు పదార్థాలే కారణమా?

కునార్ ప్రావిన్స్ రాజధాని అసదాబాద్ శివార్లలోని అందర్ సెర్ ప్రాంతంలో ఉదయం 10 గంటల సమయంలో పేలుడు సంభవించింది. పాఠశాల పక్కనే ఉన్న ఓ ఇంట్లో మైనింగ్ పనుల కోసం వినియోగించే పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు.

- మిగతా 2లో

మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినప్పుడే నిజమైన సాధికారత సాధ్యం

వంగలపూడి అనిత



- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏపీ హోంమంత్రి అనిత కీలక వ్యాఖ్యలు
- చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యం దక్కాలని వ్యాఖ్య
- మహిళలు నిర్ణయాధికారులుగా ఎదగాలన్న హోంమంత్రి

- మిగతా 2లో

లొంగిపోయిన 18 మంది మావోయిస్టులకు ఏపీ ప్రభుత్వం

రూ.75 లక్షల ఆర్థిక సాయం అందజేత

- రాష్ట్ర కమిటీ సభ్యుడు జోరిగ నాగరాజుకు రూ. 20 లక్షల సహాయం
- త్వరలోనే మరో 32 మంది మావోయిస్టులకు రూ. 1.21 కోట్ల సాయం పంపిణీ
- గత రెండున్నరేళ్లలో 18 మంది మావోయిస్టులు మృతి.. 73 మంది అరెస్ట్

- మిగతా 2లో



ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి..

రూ.1.27 లక్షల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ

పెన్ పవర్ డెస్క్: రామాయపట్నం రూపురేఖలు మార్చే భారీ చమురు శుద్ధి కర్మాగారానికి బీపీసీఎల్ ఆమోదం తెలిపింది. రూ.1.27 లక్షల కోట్లతో 9 వీమ్మ్రూా సామర్థ్యంతో ఏర్పాటు కానున్న ఈ అత్యాధునిక రిఫైనరీ రాష్ట్ర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలవనుందని మంత్రి

- మిగతా 2లో





ఉప్పు నుంచి పప్పు వరకు..

ధరల మంటలు!

- ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం.. సామాన్యుడి బడ్జెట్‌పై భారం
- ఆహార ధరలు, వాతావరణ పరిస్థితులపై ఆర్థిక శాఖ ఆందోళన

పెన్ పవర్ డెస్క్:సామాన్యుడి జేబుకు మరోసారి చిల్లు పడే సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర ధరలతో సతమతమవుతున్న దేశ ప్రజలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా నవంబర్ మంత్లీ ఎకనామిక్ రివ్యూ మరో షాకింగ్ వార్తను అందించింది. రాబోయే

- మిగతా 2లో

850 సీట్ల ప్రతిపాదన ప్రజాస్వామ్యానికి ముప్పు!



- 2024 ఎన్నికలపై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్

పెన్ పవర్ డెస్క్:డీలిమిటేషన్ పేరుతో దేశ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభ స్థానాలను 850కి పెంచడం ద్వారా బీజేపీకి ఇష్టానుసారంగా వ్యవహరించే అవకాశం కల్పిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటు చోరీ జరుగుతోందని దేశ ప్రజలు, ముఖ్యంగా యువత గుర్తించారని అన్నారు. ప్రధాని మోదీ,

- మిగతా 2లో

రష్యాలో 6.7 తీవ్రతతో

భూకంపం..

కమ్చట్కా ప్రాంతంలో ప్రకంపనలు

పెన్ పవర్ డెస్క్:రష్యాలోని కమ్చట్కా ప్రాంతంలో శనివారం (నవంబర్ 28) భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 6.7 తీవ్రత నమోదైనట్లు

- మిగతా 2లో



మద్దతిస్తే ప్రజలకు తీరని ద్రోహమే..

డీలిమిటేషన్ బిల్లుపై కాక్రోచ్ జనతా పార్టీ



- నవంబర్ 30 ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లును వ్యతిరేకించాలని విపక్షాలకు పిలుపు
- బీజేపీకి అనుకూలంగా సరిహద్దులను మార్చే 'గెర్రీమాండరింగ్' ప్రమాదంపై హెచ్చరిక
- డీఎంకే, ఎన్‌సీపీ వైఖరి మార్పుపై అతుతోష్ రంకా ఘాటు విమర్శలు
- మహిళా రిజర్వేషన్ల ముసుగులో సరిహద్దుల కుట్ర సాగుతోందని ఆరోపణ

- మిగతా 2లో

- రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పార్టీలు ఏకం కావాలని డిమాండ్

పెన్ పవర్

ఆదివారం 29 సెప్టెంబర్ 2026



పేదరికమే పెట్టుబడి.. మహిళల అండాలతో అక్రమ దందా!

అండాల అక్రమ సేకరణ కేసులో వెలుగులోకి విస్తుగొలిపే అంశాలు, పేద మహిళల ఆర్థిక నిస్సహాయతే అక్రమార్కుల లక్ష్యం, వ్యవస్థీకృత ముఠాలు, ఫర్టిలిటీ కేంద్రాల పాత్రపై లోతుగా దర్యాప్తు, నకిలీ పత్రాలు, కమీషన్లు, ఆర్థిక లావాదేవీలపై పోలీసుల నజర్, ఫర్టిలిటీ కేంద్రాల నిర్వహణపై పటిష్ఠ నిఘా అవసరం, మహిళల ఆరోగ్యం, హక్కులు, భద్రతకు భరోసా ఏది?

సంతానం లేని దంపతులకు ఆశాకిరణంగా నిలుస్తున్న ఆధునిక వైద్య పరిజ్ఞానం కొందరి ధనార్జనకు ఆయుధంగా మారుతోందన్న ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన సంతాన సాఫల్య చికిత్సల మాటున పేద మహిళల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని అండాల అక్రమ సేకరణకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు సభ్యసమాజాన్ని కలవరపెడుతున్నాయి. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన అండాల అక్రమ సేకరణ కేసు దర్యాప్తులో చోటుచేసుకుంటున్న పరిణామాలు వైద్యరంగంలో నైతిక విలువలు, చట్టాల అమలు, ప్రభుత్వ పర్యవేక్షణపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. పేదరికాన్ని పెట్టుబడిగా మార్చుకుని మహిళల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యవస్థలు ఉన్నట్లయితే వాటిని సమూలంగా అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పేద మహిళలే ఎందుకు లక్ష్యం? : కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారం, ఉపాధి అవకాశాలు లేకపోవడం, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు వంటి సమస్యలతో సతమతమవుతున్న మహిళలను అక్రమార్కులు లక్ష్యంగా చేసుకుంటున్నారన్న ఆరోపణలు తీవ్రంగా పరిగణించాల్సిన అంశం. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చని ఆశ చూపడం, అండాల సేకరణ వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవని నమ్మించడం, వైద్య ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించకుండా వారిని ఒప్పించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలను మధ్యవర్తుల ద్వారా నగరానికి తరలించి అండాలను సేకరిస్తున్నారన్న ఆరోపణలు ఈ వ్యవహారం వెనుక వ్యవస్థీకృత ముఠాల ప్రమేయం ఉందా అనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఆర్థిక అవసరాల కోసం మహిళలు తీసుకునే నిర్ణయాలను ఆసరాగా చేసుకుని వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.

దర్యాప్తులో కీలక పరిణామాలు : హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అండాల అక్రమ సేకరణ కేసులో పోలీసులు దర్యాప్తును విస్తృతం చేశారు. ఇప్పటికే అరెస్టయిన నిందితుడు ఎమిరిశెట్టి దుర్గాప్రసాద్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించగా కీలక సమాచారం లభించినట్లు తెలుస్తోంది. మహిళలను ఫర్టిలిటీ కేంద్రాలు, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) బ్యాంకులకు పరిచయం చేయడంలో అతడి పాత్ర, మధ్యవర్తులతో సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు, కమీషన్ల వ్యవహారం వంటి అంశాలపై పోలీసులు ప్రధానంగా దృష్టి సారించారు. విచారణలో భాగంగా హైదరాబాద్‌లోని ఒయాసిస్ హాస్పిటల్స్ కార్పొరేట్ కార్యాలయంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ పరికరాలు, అండదాతలకు సంబంధించిన రికార్డులు, ఆర్థిక లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఆధారాల ఫోరెన్సిక్ విశ్లేషణ ద్వారా మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, పోలీసుల తనిఖీలు జరిగినంత మాత్రాన సంబంధిత సంస్థ నేరానికి పాల్పడినట్లు నిర్ధారించలేం. సమగ్ర దర్యాప్తు అనంతరమే వాస్తవాలు వెల్లడవుతాయి.

సంతాన సాఫల్యం మాటున వ్యాపార దందా? : సంతానం కోసం పరితపించే దంపతులకు ఫర్టిలిటీ కేంద్రాలు అందిస్తున్న వైద్య సేవలు ఎంతో విలువైనవి. ఆధునిక వైద్య విధానాల ద్వారా అనేక కుటుంబాలు సంతాన భాగ్యాన్ని పొందుతున్నాయి. అయితే, ఈ రంగంలో పెరుగుతున్న వాణిజ్యీకరణ నేపథ్యంలో నైతిక విలువలకు తిలోదకాలిచ్చే వ్యక్తులు, సంస్థలు ఉన్నాయా అన్నది పరిశీలించాల్సిన అవసరం ఉంది. అండాల సేకరణలో మధ్యవర్తుల పాత్ర ఏమిటి? మహిళలను ఫర్టిలిటీ కేంద్రాలకు పరిచయం చేసినందుకు కమీషన్లు చెల్లిస్తున్నారా? అండదాతలకు సంబంధించిన రికార్డుల్లో అవకతవకలు జరుగుతున్నాయా? ఒకే మహిళ నుంచి చట్టవిరుద్ధంగా పలుమార్లు అండాలను సేకరిస్తున్నారా? అనే ప్రశ్నలకు దర్యాప్తు ద్వారా సమాధానాలు లభించాల్సి ఉంది. వైద్యసేవల పేరుతో మహిళల శరీరాలను వ్యాపార వస్తువులుగా మార్చే పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలి.

అండాల సేకరణతో ఆరోగ్యంపై ప్రభావం : మహిళల నుంచి అండాలను సేకరించడం సాధారణ ప్రక్రియ కాదు. వైద్య నిపుణుల పర్యవేక్షణలో హార్మోన్ల మందులు, ఇంజెక్షన్లు అందించి అండాశయాలను ఉత్తేజపరిచిన అనంతరం ప్రత్యేక వైద్య ప్రక్రియ ద్వారా అండాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియలో కడుపునొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్లు, అండాశయాల అధిక ఉత్తేజిత స్థితి (ఓహెచ్ఎస్ఎస్) వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. అరుదైన సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఏర్పడవచ్చు. అందువల్ల అండదాతలకు ముందస్తు వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర పరిశీలన, వైద్యపరమైన అవగాహన, స్వచ్ఛంద సమ్మతి, అనంతర వైద్య సంరక్షణ తప్పనిసరి. కేవలం డబ్బు ఆశ చూపి ఆరోగ్యపరమైన ప్రమాదాలను వివరించకుండా మహిళలను ఈ ప్రక్రియకు సిద్ధం చేయడం వారి ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుంది.

చట్టాలు ఏం చెబుతున్నాయి? : దేశంలో సంతాన సాఫల్య వైద్య సేవలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (రెగ్యులేషన్) చట్టం--2021ను తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం ఫర్టిలిటీ క్లినిక్‌లు, ఏఆర్టీ బ్యాంకులు నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ పొందాల్సి ఉంటుంది. అండదాత మహిళ వయస్సు 23 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం ఒక మహిళ తన జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే అండాలను దానం చేయవచ్చు. గరిష్ఠంగా ఏడు అండాలను మాత్రమే సేకరించేందుకు అనుమతి ఉంది. అండదాతకు నిర్దేశిత బీమా రక్షణ కల్పించడంతో పాటు ఆమె ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. అండాలు, వీర్యకణాలు, పిండాల అక్రమ విక్రయాలు, వాణిజ్య లావాదేవీలు, దాతల దోపిడీ వంటి చర్యలను చట్టం నిషేధిస్తోంది. ఇంత స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ అక్రమ సేకరణకు సంబంధించిన ఆరోపణలు వెలుగులోకి రావడం చట్టాల అమలు తీరును సమీక్షించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తోంది.

నకిలీ పత్రాల వెనుక ఎవరున్నారు? : అండాల అక్రమ సేకరణ వ్యవహారంలో నకిలీ పత్రాల వినియోగంపై పోలీసులు దృష్టి సారించడం కీలక పరిణామం. మహిళల వయస్సు, గుర్తింపు వివరాలు, గతంలో అండదానం చేసిన సమాచారం, వైద్య పరీక్షల నివేదికలు, సమ్మతి పత్రాల్లో మార్పులు చేశారా అన్నది తేలాల్సి ఉంది. ఒకవేళ నకిలీ పత్రాలతో చట్టపరమైన నిబంధనలను తప్పించుకున్నట్లు నిర్ధారణ అయితే, వాటిని రూపొందించిన వారితో పాటు ఆ పత్రాలను ఉద్దేశపూర్వకంగా ఉపయోగించిన వారిపైనా చర్యలు తీసుకోవాలి. ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, డిజిటల్ చెల్లింపులు, మధ్యవర్తులకు అందిన కమీషన్ల వివరాలను పరిశీలించడం ద్వారా ఈ వ్యవహారం వెనుక ఉన్న వ్యక్తుల పాత్రను గుర్తించే అవకాశం ఉంటుంది. దర్యాప్తు కేవలం మధ్యవర్తులకే పరిమితం కాకుండా ఆధారాల మేరకు బాధ్యులైన ప్రతి ఒక్కరి వరకు విస్తరించాలి.

ప్రభుత్వ పర్యవేక్షణ ఎంతవరకు? : హైదరాబాద్ నగరం వైద్యరంగంలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి రోగులు చికిత్సల కోసం నగరానికి వస్తుంటారు. సంతాన సాఫల్య కేంద్రాల సేవలకు కూడా విస్తృత ఆదరణ ఉంది. ఈ నేపథ్యంలో ఫర్టిలిటీ కేంద్రాలు, ఏఆర్టీ బ్యాంకుల నిర్వహణపై ప్రభుత్వ పర్యవేక్షణ మరింత పటిష్ఠంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆయా కేంద్రాలు చట్టబద్ధమైన అనుమతులతో పనిచేస్తున్నాయా? అండదాతల వివరాలను సక్రమంగా నమోదు చేస్తున్నాయా? వైద్య ప్రక్రియల్లో నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అండదాతల వ్యక్తిగత గోప్యతకు భంగం కలగకుండా రికార్డుల పరిశీలనకు పటిష్ఠమైన సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి.

బాధిత మహిళలకు అండగా నిలవాలి : ఈ తరహా కేసుల్లో మహిళలను కేవలం విచారణకు సంబంధించిన వ్యక్తులుగా చూడకుండా వారి పరిస్థితులను మానవీయ కోణంలో అర్థం చేసుకోవాలి. ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లేమి, మధ్యవర్తుల ప్రలోభాలు, ఒత్తిళ్ల కారణంగా దోపిడీకి గురైన మహిళలకు ప్రభుత్వం అండగా నిలవాలి. అవసరమైన వైద్య పరీక్షలు, ఉచిత చికిత్స, మానసిక కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించాలి. వారి వ్యక్తిగత వివరాలు బయటకు రాకుండా గోప్యతను కాపాడాలి. బాధితులుగా గుర్తించిన మహిళలకు అవసరమైన పునరావాసం, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలి. పేదరికం కారణంగా మహిళలు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితులు తలెత్తకుండా సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి.

అంతర్రాష్ట్ర ముఠాలపై ప్రత్యేక నిఘా : ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తరలిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారం ఒక్క నగరానికే పరిమితమైందా? లేక అంతర్రాష్ట్ర స్థాయిలో వ్యవస్థీకృతంగా కొనసాగుతోందా? అనే అంశాన్ని పరిశీలించాలి. అవసరమైతే ఆయా రాష్ట్రాల పోలీసు, వైద్యారోగ్య శాఖలతో సమన్వయం చేసుకుని దర్యాప్తు చేపట్టాలి. మహిళలను మోసం చేయడం, బలవంతం చేయడం లేదా వారి నిస్సహాయతను దుర్వినియోగం చేసి దోపిడీకి గురిచేయడం వంటి అంశాలు నిర్ధారణ అయితే మానవ అక్రమ రవాణాకు సంబంధించిన చట్టాలు వర్తిస్తాయా అన్నదీ పరిశీలించాలి. అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలతో నిర్ధారణ అయిన సంస్థలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిబంధనలకు అనుగుణంగా సేవలందిస్తున్న ఫర్టిలిటీ కేంద్రాలపై అనవసర అపోహలు ఏర్పడకుండా చూడాలి. వైద్యం సేవ కావాలి.. దోపిడీకి వేదిక కాకూడదు! : వైద్యరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం సమాజానికి వరం. సంతానం లేని దంపతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సంతాన సాఫల్య వైద్య విధానాలు మానవాళికి ఎంతో ఉపయోగకరమైనవి. అయితే, ఆ సేవల వెనుక మరో మహిళ కన్నీరు, ఆర్థిక నిస్సహాయత, ఆరోగ్య సమస్యలు ఉండకూడదు. వైద్యరంగంలో వ్యాపార ప్రయోజనాల కంటే మానవీయ విలువలు, నైతిక ప్రమాణాలు, రోగులు, అండదాతల భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చిన ఈ కేసును ప్రభుత్వం ఒక సాధారణ నేర ఘటనగా కాకుండా వైద్యరంగంలో నియంత్రణ వ్యవస్థను సమీక్షించేందుకు ఒక హెచ్చరికగా పరిగణించాలి. నిష్పాక్షిక దర్యాప్తు ద్వారా వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత కార్యాచరణ రూపొందించాలి. పేదరికం నేరం కాదు.. పేదరికాన్ని ఆసరాగా చేసుకుని మహిళలను దోపిడీ చేయడమే నేరం. మహిళల శరీరాలు వ్యాపార వస్తువులు కావు. వారి నిస్సహాయత అక్రమార్కుల ఆదాయ వనరుగా మారకూడదు. ఒక కుటుంబంలో సంతాన సంతోషాన్ని నింపే వైద్య ప్రక్రియ మరో మహిళ జీవితంలో విషాదాన్ని నింపకూడదు. మహిళల ఆత్మగౌరవం, ఆరోగ్యం, హక్కులను పరిరక్షించినప్పుడే వైద్యరంగానికి నిజమైన గౌరవం.. సమాజానికి నిజమైన పురోగతి.

నాలుగు వ్యవస్థల బలంతోనే సంక్షోభాలను అధిగమించాం!

- మొదటి పేజీ తరువాయి

రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలో నిర్వహించిన చారిత్రక వేడుకల్లో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీఎన్ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి.నరసింహా, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించిన సీఎం.. సీనియర్ న్యాయవాదులు, విశ్రాంత న్యాయమూర్తులను సత్కరించారు.

న్యాయవ్యవస్థలో ఏఐ వినియోగం

కోర్టుల్లో కేసుల నిర్వహణను మరింత వేగవంతం చేసేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని చంద్రబాబు సూచించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 'లీగల్ ఏఐ స్టాక్'ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ విధానం ద్వారా రాష్ట్రంలో 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

భవిష్యత్తులో కృత్రిమ మేధ సహాయంతో కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ, చట్టాలు, నిబంధనల సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందని వివరించారు. గతంలో తాటాకులపై తీర్పులు రాసే విధానం నుంచి నేడు ఏఐ సాంకేతికతను ఉపయోగించే స్థాయికి న్యాయవ్యవస్థ ఎదగడం గొప్ప పరిణామమని అభిప్రాయపడ్డారు.

ప్రత్యామ్నాయ మార్గాలతో సత్వర న్యాయం

కోర్టుల్లో కేసులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండకుండా ప్రత్యామ్నాయ పరిష్కార విధానాలను ప్రోత్సహించాలని సీఎం సూచించారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్ ద్వారా వివాదాలను త్వరగా పరిష్కరించుకునే అవకాశాలను విస్తరించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా ప్రతివాదిగా ఉన్న కేసులను న్యాయస్థానాల సహకారంతో త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కలిగించాలన్నది తమ ఆలోచనగా వెల్లడించారు.

1849లోనే అధికారిక గుర్తింపు పొందిన సీతానగరం రచ్చబండ ప్రజా కోర్టు చరిత్రను ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సామాన్యులకు సకాలంలో న్యాయం అందించడమే న్యాయవ్యవస్థతో పాటు ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం కావాలని అన్నారు.

అమరావతికి అండగా హైకోర్టు తీర్పులు

గతంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఇచ్చిన చారిత్రక తీర్పు అమరావతి రాజధానికి, రాష్ట్రానికి అండగా నిలిచిందని చంద్రబాబు ప్రశంసించారు. ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ లీసా గిల్‌ను అభినందించారు. దేశ తొమ్మిదో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కోకా సుబ్బారావు రాజమండ్రి బార్ అసోసియేషన్‌లోనే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారని గుర్తుచేశారు. టంగుటూరి ప్రకాశం పంతులు వంటి ప్రముఖులు కూడా ఈ ప్రాంతం నుంచే న్యాయవాద వృత్తిని ప్రారంభించిన విషయాన్ని ప్రస్తావించారు.

వచ్చే ఏడాది పోలవరం పూర్తి

2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనతో పాటు స్వర్ణాంధ్ర నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని చంద్రబాబు తెలిపారు. వచ్చే ఏడాది పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతో పాటు గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పుష్కరాల సమయంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు రావాలని కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులను సాదరంగా ఆహ్వానించారు.

నేడు పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్..

- మొదటి పేజీ తరువాయి

పట్ల సానుకూల వాతావరణం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని రెండో విడత పంచాయతీ ఎన్నికలను కూడా నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఎన్నిక ఎంతో ముఖ్యమైనదని, బూత్ స్థాయి నుంచే పకడ్బందీ ఎన్నికల వ్యూహాలను అమలు చేయాలని ఆయన సూచించారు.

ప్రతి ఓటూ ఎంతో కీలకమని గుర్తు చేస్తూ, క్షేత్రస్థాయిలో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని లోకేశ్ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఎక్కడైనా రెబల్స్ సమస్యలు ఉంటే స్థానిక నాయకత్వంతో మాట్లాడి వెంటనే పరిష్కరించుకోవాలని ఆదేశించారు. కూటమి భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం కొనసాగాలని, ఓట్లు వంద శాతం బదిలీ అయ్యేలా నేతలు, శ్రేణులు బాధ్యత తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

పార్టీ కోసం క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. మంచి ఫలితాలు సాధించిన వారికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. మొదటి విడత కంటే రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కూటమి శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో 1,171 సర్పంచి స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 3,803 స్థానాలకు రేపు పోలింగ్ జరగనుంది.

స్కూల్ సమీపంలో భారీ పేలుడు.. ఏడుగురు విద్యార్థులు మృతి!

- మొదటి పేజీ తరువాయి

వాటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా పేలుడు సంభవించి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే అసలు కారణంపై దర్యాప్తు కొనసాగుతోంది.

కుప్పకూలిన పాఠశాల భవనం

పేలుడు తీవ్రతకు సమీపంలోని భవనాలతో పాటు పాఠశాల భవనం కొంతభాగం దెబ్బతిని కూలిపోయింది. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, సహాయక సిబ్బంది రంగంలోకి దిగి శిథిలాల నుంచి క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చారు. గాయపడిన వారిని అసదాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

కొనసాగుతున్న దర్యాప్తు

కునార్ ప్రావిన్స్ సమాచార, సాంస్కృతిక శాఖ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏడుగురి మృతదేహాలను ఆసుపత్రికి తరలించగా,

97 మంది గాయపడినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. వీరిలో కొందరు చికిత్స అనంతరం ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి కాగా, మరికొందరు చికిత్స పొందుతున్నారు. పేలుడు పదార్థాలను నిల్వ చేసిన తీరుపై అధికారులు విచారణ చేపట్టారు.

ఉప్పు నుంచి పప్పు వరకు.. ధరల మంటలు!

- మొదటి పేజీ తరువాయి

రోజుల్లో దేశంలో ద్రవ్యోల్బణం మరింత పెరిగే ప్రమాదం ఉందని.. ముఖ్యంగా ఆహార పదార్థాలు సహా ఇతర వస్తువుల ధరలు మళ్లీ భగ్గుమనే అవకాశం ఉందని కేంద్రం హెచ్చరించింది.అక్టోబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం ఏకంగా 8.94 శాతానికి ఎగబాకి సామాన్యులకు చుక్కలు చూపించింది. దీనికి తోడు పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో మార్కెట్లో వస్తువులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మరోవైపు వాతావరణ మార్పులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. ఏడాది చివరి నాటికి 'ఎల్‌నినో' ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరించడం పంటల దిగుబడి, ఆహార ధరలపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తోంది.

అంతర్జాతీయంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, హార్మూజ్ జలసంధి గుండా జరిగే సరుకు రవాణాపై ఉన్న ముప్పు కూడా ధరల పెరుగుదలకు ఆజ్యం పోస్తోంది. అయితే ఈ కష్టకాలంలోనూ కాస్త ఊరటనిచ్చే అంశాలు లేకపోలేదు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు రావడం, రూపాయి విలువ బలపడటం వల్ల దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు అదుపులో ఉండే ఛాన్స్ ఉంది. అలాగే పాజిటివ్ జోన్‌లో ఉన్న ఇండియన్ ఓషన్ డైపోల్ కొనసాగితే ఎల్‌నినో తీవ్రత కొంతమేర తగ్గవచ్చు.మొత్తానికి రాబోయే కొన్ని నెలల పాటు ఆహార ధరలు, వాతావరణ పరిస్థితులు, పండుగ డిమాండ్ దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించనున్నాయి. సవాళ్లు ఎన్ని ఎదురైనా.. మన దేశ ఆర్థిక మూలాలు బలంగా ఉన్నాయని, ఎలాంటి ఒడిదుడుకులనైనా తట్టుకునే సామర్థ్యం భారత్‌కు ఉందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ధీమా వ్యక్తం చేస్తోంది.

850 సీట్ల ప్రతిపాదన ప్రజాస్వామ్యానికి ముప్పు!

- మొదటి పేజీ తరువాయి

హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఓటు చోరీకి పాల్పడ్డారని ఆరోపించారు.2024 ఎన్నికలు అసలు న్యాయబద్ధంగా జరగలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ మోదీ చెప్పినట్లుగా ఎన్నికల మ్యాప్‌ను రూపొందిస్తోందని, బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల నియోజకవర్గాల పునర్విభజనకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. దేశంలో కులగణన నిర్వహించడం బీజేపీకి ఇష్టం లేదని ఆరోపించారు. ఎన్నికల్లో రిగ్గింగ్‌కు బీజేపీ పాల్పడుతోందని దేశవ్యాప్తంగా ప్రజలకు తెలుసని రాహుల్ అన్నారు.

డీలిమిటేషన్ కమిషన్‌ను మోదీ ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకుందని రాహుల్ గాంధీ ఆరోపించారు. 2027 జనాభా లెక్కల ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్లను కూడా ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల ప్రాతిపదికన అమలు చేయాలన్నారు. 850 సీట్ల ప్రతిపాదన ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతుందని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

లొంగిపోయిన 18 మంది మావోయిస్టులకు ఏపీ ప్రభుత్వం

రూ.75 లక్షల ఆర్థిక సాయం అందజేత

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్‌ను నక్సల్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. రాజధాని అమరావతిలోని ఏపీ డీజీపీ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో, లొంగిపోయిన 18 మంది మావోయిస్టులకు పునరావాస సహాయం కింద మొత్తం రూ. 75 లక్షల డిమాండ్ డ్రాఫ్టులను (డీడీలు) ఆయన స్వయంగా అందజేశారు.లొంగిపోయిన వారిలో మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు జోరిగ నాగరాజు అలియాస్ కమలేశ్, ఇద్దరు డివిజనల్ కమిటీ సభ్యులు, పది మంది ఏరియా కమిటీ సభ్యులు, ఐదుగురు దళ సభ్యులు ఉన్నారు. నాగరాజుకు రూ. 20 లక్షలు అందజేయగా, మిగిలిన 17 మందికి రూ. లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మొత్తం రూ. 2.87 కోట్ల రివార్డులో ఇప్పటికే రూ. 91 లక్షలు అందించామని, నేడు రూ. 75 లక్షలు ఇచ్చామని డీజీపీ చెప్పారు. లొంగిపోయిన మరో 32 మందికి రూ. 1.21 కోట్ల ఆర్థిక సహాయాన్ని త్వరలోనే అందిస్తామని స్పష్టం చేశారు.

గత రెండున్నరేళ్ల కాలంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 18 మంది మావోయిస్టులు మరణించారని, 73 మందిని పోలీసులు అరెస్టు చేశారని డీజీపీ వివరించారు. హింస ద్వారా ఏదీ సాధించలేమనే భావన వారిలో స్పష్టంగా కనిపిస్తోందని, ప్రధాన స్రవంతిలోకి వచ్చిన వారి జీవనోపాధిపై నిరంతరం ఆరా తీస్తున్నామని తెలిపారు. మరోవైపు మన్యం ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశామని, సరళ్, ప్రేరణ, స్ఫూర్తి వంటి కార్యక్రమాల ద్వారా వేలాది మంది యువతకు శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీలో 169 రహదారులు, 39 వంతెనల నిర్మాణం చేపట్టామని, 2,090

మూడు నెలల్లో నేర నియంత్రణకు పటిష్ట చర్యలు





- రూ.1.20 కోట్ల విలువైన గంజాయి, హాషిష్ ఆయిల్ స్వాధీనం.. 43 సెల్‌ఫోన్ల రికవరీ
- ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం
- ఎస్పీ కె. చక్రవర్తి

రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్, నవంబర్ 28: పోలవరం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, అక్రమ మద్యం నియంత్రణ, రహదారి భద్రత, ప్రజల్లో అవగాహన కల్పనతో పాటు ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీస్ శాఖ సాధించిన ప్రగతిని వెల్లడించారు.పోలీసులు నిర్వహించిన ప్రత్యేక చర్యల్లో రూ.7.18 లక్షల విలువైన 43 పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై 12 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్టు చేయడంతో పాటు 220 కిలోల గంజాయి, కిలో హాషిష్ ఆయిల్, 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1.20 కోట్లు. పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం కింద 25 ఉత్తర్వులు పొందగా, 17 మందిని నిర్బంధించి జైలుకు పంపించారు.అక్రమ మద్యం విక్రయాలపై 105 కేసులు నమోదు చేసి 105 మందిని అరెస్టు చేశారు. 288.67 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా తయారీ, విక్రయాలపై 16 కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్టు చేశారు. 183 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 1,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 31 కేసులు నమోదు చేసి రూ.52,500 జరిమానా విధించారు. మోటారు వాహనాల చట్టం కింద 3,803 కేసులు నమోదు చేసి రూ.49.59 లక్షల జరిమానా విధించారు.ప్రజల్లో చట్టాలపై అవగాహనకు త్రిశూల్ కార్యక్రమం కింద 307 సమావేశాలు, రహదారి భద్రతపై 70 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యాటక ప్రాంతాల్లో సందర్శకుల భద్రతకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టారు.జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 65.48 శాతం పోలింగ్‌తో ప్రశాంతంగా నిర్వహించగా, మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో 69.61 శాతం పోలింగ్ నమోదైందన్నారు. రెండో విడత ఎన్నికల కోసం తొమ్మిది పోలీస్ స్టేషన్ల పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం, ట్రాఫిక్ ఉల్లంఘనలు, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం కఠిన చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో రంపచోడవరం డీఎస్పీ పి. అబ్రహ్ అలీ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జె. భాను ప్రసాద్, సీఐ టి.జి.ఎన్. ప్రసాద్ తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

పదకొండుమంది వ్యక్తులపై కేసులునమోదు



వి.ఆర్.పురం పెన్.పవర్.నవంబర్. 28 జిల్లాపోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ),ఎటపాకసర్కిల్ ఇన్‌స్పెక్టర్,ఆదేశాలమేరకు స్థానిక సంస్థలఎన్నికల నేపథ్యంలో మండలంలోఅక్రమ మద్యంవిక్రయాలు, నిల్వలపైపోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశారు.మండలంలో గతనాలుగు రోజులుగా పోలీసులు వరుసగాదాడులు,(తనిఖీలు)నిర్వహిస్తూఅక్రమ మద్యంవ్యాపారులపైచర్యలు చేపట్టారు.స్థానికులనుంచి అందినసమాచారం మేరకు మండలం లోనివివిధ గ్రామాలు,ప్రాంతాల్లోఅక్రమంగా మద్యంనిల్వ ఉంచుతున్నప్రదేశాలను గుర్తించిపోలీసులు దాడులు నిర్వహించారు.ఈతనిఖీల్లో మొత్తం 286మద్యంబాటిళ్ల నుస్వాధీనం చేసుకోవడంతోపాటు,అక్రమ మద్యం నిల్వలు,విక్రయాలకుసంబంధించి11మంది పైకేసులునమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ సాధిక్ వెల్లడించారు.ఎన్నికల సమయంలో మద్యం అక్రమ విక్రయాలు,పంపిణీ ద్వారాఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలనుఅడ్డుకోవడమేలక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లుతెలిపారు. గ్రామాల్లోఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసు సిబ్బంది.అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని,పేర్కొన్నారు.

విజయం సాధించిన టీడీపీ ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే శిరీషాదేవి ఘన సన్మానం

- గ్రామాల సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి
- ఎమ్మెల్యే శిరీష దేవి





రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో)పెన్ పవర్ నవంబర్ 28: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున విజయం సాధించిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఘనంగా సన్మానించి అభినందించారు.దొరమామిడి, చేరుకొమ్ముపాలెం, జగ్గంపాలెం, జియ్యంపాలెం, జడేరు, సురంపాలెం, నెల్లిపూడి, ఎండపల్లి, భయన్నపల్లి, పిడతమామిడి, గంగవరం, లక్కొండ, అమదాలబంధ, ధన్యంపాలెం గ్రామ పంచాయతీల్లో విజయం సాధించిన నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్యం, అంతర్గత రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, నూతన ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డాక్టర్ తీగల ప్రభ, పలు మండలాలకు చెందిన మండల కమిటీ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, సుభాష్ ,నూతన ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

7 మండలాల్లో 90 గ్రామ పంచాయతీలు, 757 వార్డులకు రేపు పోలింగ్







రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 28: పోలవరం జిల్లాలో రెండో విడత, తుది దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం (నవంబర్ 29) ఏడు మండలాల్లోని 90 గ్రామ పంచాయతీలు, 757 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన మండలాలకు చేరుకుని, పోలింగ్ సామగ్రిని స్వీకరించి సంబంధిత పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ శనివారం వెల్లడించారు.

చింతూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని వి.ఆర్.పురం, చింతూరు, కూనవరం, యటపాక మండలాలతో పాటు రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మారేడుమిల్లి, వై.రామవరం, గూర్తేడు మండలాల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

4 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

రెండో విడతలో మొత్తం 95 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టగా, నాలుగు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వెంకటరెడ్డిపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మిగిలిన 90 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ జరగనుండగా, సర్పంచ్ పదవుల కోసం 281 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

757 వార్డులకు 1,725 మంది పోటీ

జిల్లాలో మొత్తం 884 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టగా, 122 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మరో ఐదు వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో మిగిలిన 757 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ స్థానాల్లో మొత్తం 1,725 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మారేడుమిల్లి మండలం మర్రిగూడెం గ్రామ పంచాయతీలో 3, 5వ వార్డులకు, వెంకటరెడ్డిపేట గ్రామ పంచాయతీలో 3, 4, 5వ వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదని అధికారులు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల సిబ్బందికి అవసరమైన పోలింగ్ సామగ్రి అందజేసి, వారిని సంబంధిత కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ కోరారు.

లోక్ అదాలత్, ఆర్బిట్రేషన్ ప్రత్యామ్నాయాలతో సత్వర న్యాయం

జిల్లా కోర్టు 222వ, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబరు 28: న్యాయ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి కేసుల నిర్వహణను సమర్థంగా, వేగంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. లీగల్ గవర్నెన్స్, లిటిగేషన్ మేనేజ్‌మెంట్ కోసం త్వరలోనే లీగల్ ఏఐ స్టాక్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ లిటిగేషన్ కేస్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ ద్వారా 8.4 లక్షల కేసులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏఐ ఆధారంగా కేసుల విశ్లేషణ, కౌంటర్ అఫిడవిట్ల తయారీ, చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, కేసుల రికార్డులను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకురావడం ఈ వ్యవస్థ లక్ష్యమని వివరించారు. తూర్పుగోదావరి జిల్లా కోర్టు 222 ఏళ్లు, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో నిర్వహించిన వేడుకల్లో సీఎం పాల్గొని ప్రసంగించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్వీఎన్ నారాయణ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ పి.నరసింహ, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసాగిల్, త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రామచంద్రరావు, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వారి సమక్షంలో వార్షికోత్సవ సావనీర్‌ను సీఎం విడుదల చేశారు. సీనియర్ న్యాయవాదులు, న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థతో పాటు ప్రజాప్రతినిధుల వ్యవస్థ కూడా ప్రజల హక్కుల పరిరక్షణకు పనిచేస్తోం దన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ ప్రజలకి సకాలంలో న్యాయం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం, ఆర్బిట్రేషన్ వంటి ప్రత్యామ్నాయ విధానాలను ప్రోత్సహించడం ద్వారా కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయవచ్చ నన్నారు. కోర్టుల్లో ప్రభుత్వం ప్రతివాదిగా ఉన్న కేసులను న్యాయస్థానాల సహకారంతో త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ప్రయోజనం కల్పించాలన్నారు. తాటి ఆకులపై తీర్పుల ప్రతులు రాసిన రోజుల నుంచి నేటి కృత్రిమ మేధ వరకు న్యాయ వ్యవస్థ ఎంతో రూపాంతరం చెందిందన్నారు. ప్రజా కోర్టుగా పేరొందిన సీతానగరం రచ్చబండ కోర్టు 1849లోనే అధికారిక కోర్టుగా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. రాజమండ్రి బార్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా కోర్టులు సుదీర్ఘకాలంగా ప్రజలకు న్యాయ సేవలు అందిస్తున్నాయని అభినందించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్‌లో న్యాయవాది జస్టిస్ కోకా సుబ్బారావు దేశ తొమ్మిదో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేయడం గర్వకారణ మన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పు రాష్ట్రాన్ని, అమరావతిని కాపాడిందని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసాగిల్ చరిత్రలో నిలిచిపోయారని అభినందించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం అమల్లోకి వస్తుందన్నారు. సీఎంగా మూడోసారి గోదావరి పుష్కరాలను నిర్వహించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పుష్కరాలకు విచ్చేసి పుణ్య స్నానాలు ఆచరించాలని సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. 222 ఏళ్ల చరిత్ర కలిగిన తూర్పుగోదావరి జిల్లా కోర్టుకు, 131 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న రాజమండ్రి బార్ అసోసియేషన్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవగాహన కార్యక్రమం



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్, నవంబర్ 28:విద్యార్థులు, యువతలో స్వయం ఉపాధి, పారిశ్రామిక ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శనివారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, ఎంఎస్‌డీఈ, సిఎఫ్‌ఎల్, హెచ్‌ఆర్‌ఎఫ్ గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.టి. మహాలక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు.కార్యక్రమ సమన్వయకర్త శ్రీను అప్పికొండ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకాలు, వివిధ పథకాలు, చిన్న పరిశ్రమలు ప్రారంభించేందుకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. సామాజిక కార్యకర్త హరి వెంకట్ మాట్లాడుతూ బ్యాంకు రుణ సదుపాయాలు, ఆర్థిక పథకాలు, ఆర్థిక అక్షరాస్యత ప్రాధాన్యతను వివరించారు.హెచ్‌ఆర్‌ఎఫ్ గ్లోబల్ ఫౌండేషన్ డైరెక్టర్ బాలు అక్కిస మాట్లాడుతూ స్థానికంగా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి తమ సంస్థ ద్వారా అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రంపచోడవరంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా, సాయిబాబా గుడి పక్కన ఉన్న ఫౌండేషన్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు పద్మావతి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టినరోజున హెల్మెట్లు పంపిణీ



జీలుగుమిల్లి ,పెన్ పవర్, నవంబర్ 28; జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న కూరం ప్రసాద్ కుమార్తె దీప్తి ఫ్లోరెన్స్ ఐదవ పుట్టినరోజు సందర్భంగా శనివారం జీలుగుమిల్లిలో 64 మంది యువకులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా జీలుగుమిల్లి సీఐ బి యాదగిరి, ఎస్సై వి క్రాంతి కుమార్ ,డాక్టర్లు మణికంఠేశ్వర్, పవన్ కుమార్ ల చేతుల మీదుగా యువకులకు స్థానిక పోలీస్ స్టేషన్లో అందజేశారు. ఈ సందర్భంగా కురం ప్రసాదు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మా స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో కేవలం హెల్మెట్ లేకపోవడం వల్ల తలకు తీవ్రమైన దెబ్బలు తగిలి చనిపోవడం జరిగిందని అన్నారు. జీలుగుమిల్లి పరిసర ప్రాంతాల్లో అనేకమంది రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రమైన గాయాలు పాలై చనిపోయిన పరిస్థితులు చూసి మా కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ఉచితంగా హెల్మెట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. అధికారులు, వాహనదారులు కురం ప్రసాద్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఇతరులకు సహాయం చేయడంలో కూరంప్రసాద్ నీ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి పిహెచ్సి సిహెచ్ఓ శ్రీనివాసరాజు, హెడ్ కానిస్టేబుల్ మంగయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్స్ ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

డిసెంబర్ 2వ తేదీతో ముగియనున్న దరఖాస్తుల గడువు

రంపచోడవరం, నవంబర్ 28 (పెన్ పవర్):2027--28 విద్యా సంవత్సరానికి దేశవ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్స్, నూతన సైనిక్ స్కూల్స్‌లో 6, 9వ తరగతుల ప్రవేశాల కోసం నిర్వహించే అఖిల భారత సైనిక్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష (ూ×ూూజుజు-2027)కు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోలవరం జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రుక్మండయ్య తెలిపారు.గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చదువుతున్న 5వ, 8వ తరగతుల విద్యార్థుల్లో ఆసక్తి కలిగిన వారిని ఈ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేయించే బాధ్యతను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. నవంబర్ 3వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, డిసెంబర్ 2వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ప్రవేశ పరీక్షకు సంబంధించిన దరఖాస్తులు, అర్హతలు, ఇతర పూర్తి వివరాల కోసం విద్యార్థులు) వెబ్‌సైట్‌లను సందర్శించాలని ఉపసంచాలకులు సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చింతూరులో ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం



చింతూరు, పెన్ పవర్ నవంబర్ 26: చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమాన్ని సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్, చింతూరు మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోటీ పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, సమగ్రత, దేశభక్తి భావాలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సంతోష్ కుమార్ సింగ్ హాజరుకాగా, కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ బి. భరత్ చంద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భారతదేశంలోని విభిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల మధ్య ఐక్యతను చాటిచెప్పే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందిస్తాయని అన్నారు. యువత విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన పోటీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిని బి. రిషిత (ప్రథమ సంవత్సరం ఎంపీసీ), ద్వితీయ బహుమతిని ఎస్. అర్జున్ (ప్రథమ సంవత్సరం బైపీసీ), తృతీయ బహుమతిని పి. నవ్య (ద్వితీయ సంవత్సరం హెచ్ఈసీ) సాధించారు. విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ అధ్యాపకులు అప్పల నాయుడు, బోటనీ అధ్యాపకులు రాము, తెలుగు అధ్యాపకురాలు సుశీల, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ 42వ బెటాలియన్ అధికారులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.ం

నవోదయ ప్రవేశ పరీక్షకు 1,504 మంది విద్యార్థులు



గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, నవంబర్ 28: పోలవరం జిల్లాలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో శనివారం నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ మూర్తి తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న మొత్తం 1,504 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.రంపచోడవరంలోని పరీక్షా కేంద్రాన్ని డీఈఓ శ్రీరామ్ మూర్తి పరిశీలించగా, పరీక్షల కన్వీనర్ శ్రీనివాసరావు చింతూరు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎటపాకలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతికి 80 సీట్లు అందుబాటులో ఉన్నాయని డీఈఓ తెలిపారు.

ఐదు దశాబ్దాల న్యాయసేవ కు ఘన నీరాజనం

సీనియర్ న్యాయవాదులు, విశ్రాంత, హైకోర్టు న్యాయ మూర్తులకు సిఎం సత్కారం

222 ఏళ్ల జిల్లా న్యాయ స్థానం,131 ఏళ్ల బార్ అసోసియేషన్ చారిత్రక వేడుకలు



రాజమహేంద్రవరం , పెన్ పవర్, నవంబర్ 28:ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా న్యాయస్థానం 222 సంవత్సరాల సుదీర్ఘ న్యాయ ప్రస్థానాన్ని, రాజమండ్రి బార్ అసోసియేషన్ 131 సంవత్సరాల విశిష్ట చరిత్రను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం స్థానిక హోటల్ మంజీరా సరోవర్‌లో న్యాయరంగ ప్రముఖులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ పమిడిగతం నరసింహ, జస్టిస్ సరస వెంకట నారాయణ భట్టి, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.హెచ్.వి. ప్రసాద్ తదితర ప్రముఖులు, సీనియర్ న్యాయవాదులు, విశ్రాంత న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లు 222 సంవత్సరాల జిల్లా న్యాయస్థానం, 131 సంవత్సరాల రాజమండ్రి బార్ అసోసియేషన్ చారిత్రక ప్రస్థానం, న్యాయరంగ ప్రముఖుల సేవలు, న్యాయ వారసత్వ విశేషాలను ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సావనీర్‌లో రెండు శతాబ్దాలకు పైగా కొనసాగుతున్న న్యాయ వారసత్వాన్ని , న్యాయస్థాన చరిత్ర, బార్ అసోసియేషన్ ప్రస్థానం, న్యాయ మూర్తులు, ప్రముఖ న్యాయవాదుల సేవలు, విశేషాలను పొందు పరిచారు.

ఐదు దశాబ్దాల న్యాయ వాద సేవలకు గుర్తింపు...

న్యాయవాద వృత్తిలో 50 సంవత్సరాల పాటు సేవలందించిన ఆరుగురు సీనియర్ న్యాయ వాదులను ఘనంగా సన్మానించారు. సత్కారం పొందిన వారిలో పోతుకూచి సూర్యనారా యణ మూర్తి, ఎన్.వి. గోపాలకృష్ణ మూర్తి, ఎస్.జి. రామారావు, జె.వి. సుబ్బారావు, ఎం. శివ సుబ్బారావు, ఎం. శ్రీమన్నారాయణ మూర్తి ఉన్నారు. వీరి ప్రస్థానం భావితరాల న్యాయ వాదులకు స్ఫూర్తి దాయకమని కొనియాడారు.న్యాయవ్యవస్థలో వివిధ హోదాల్లో వృతి విలువలతో సేవలందించిన జస్టిస్ గోడా రఘురామ్, జస్టిస్ కె.సి. భాను, జస్టిస్ ఎస్. రవికుమార్, జస్టిస్ బి. శివ శంకరరావు, జస్టిస్ ఎం. సీతారామమూర్తి, జస్టిస్ రావు రఘునందనరావు, ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు, జస్టిస్ బి.వి.ఎల్. ఎన్. చక్రవర్తిలను ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుల విశ్రాంత న్యాయ మూర్తులను ఘనంగా సత్కరించారు.త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రరావు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్‌లను ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఎస్. భానుమతి, డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ సునీత గంధంలను ముఖ్యమంత్రి, సుప్రీంకోర్టు న్యాయ మూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు. న్యాయపరమైన నిబద్ధత భావితరాల న్యాయవాదులకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

న్యాయవాద వృత్తి స్వతంత్ర్యాన్ని కాపాడు కోవాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహా



రాజమహేంద్రవరం, పెన్ పవర్ 28:న్యాయవాద వృత్తిలో వృత్తిపరమైన స్వతంత్రతను, నైతిక విలువలను వదులు కోకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ స్పష్టం చేశారు. సత్యం కోసం తర్కం, విశ్లేషణ, సమర్థవంత వాదనలే ప్రధాన మార్గాలని, సత్యాన్వేషణకు అత్యుత్తమ స్థాయిలో న్యాయవాద వృత్తి అందిస్తుందని ఆయన అన్నారు. న్యాయవాద వృత్తి పట్ల తనకు గౌరవం ఉందన్నారు. శనివారం రాష్ట్ర ప్రభత్వం అధికారిక వేడుకగా నిర్వహించిన 222 ఏళ్ల ను పూర్తి చేసుకున్న చరిత్రత్మక జిల్లా కోర్ట్, 131 రాజమండ్రి బార్ అసోసియేషన్ వేడుక కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. రాజమండ్రి జిల్లా కోర్టు రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగి ఉండటం విశేషమని జస్టిస్ నరసింహ అన్నారు. 1895 అక్టోబర్ 20న న్యాయవాదులు సంఘటితమై బార్ అసోసియేషన్ నేటి వరకు నిరంతరాయంగా కొనసాగడం అభినందనీ యమన్నారు. సంస్థాగత విలువలు, సంప్రదాయాలు తరతరాలకు కొనసాగుతాయన్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వం న్యాయవాదులు చట్టాలను అధ్యయనం చేసి, ప్రజల సమస్యలు, హక్కులపై కోర్టుల్లో వాదనలు వినిపించేవారని గుర్తుచేశారు. స్థానిక ప్రజలు, రైతుల ఇబ్బందులను న్యాయవాదులు న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేశారని వివరించారు. రాజ్యాంగ హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం, న్యాయం విలువలు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులన్నారు. చట్టాల వ్యాఖ్యానాలు, న్యాయ ప్రక్రియలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సాగాల్సిన బాధ్యత పెరిగిందన్నారు. బార్ బలం స్వతంత్రతలోనే ఉందన్నారు. న్యాయవాద వృత్తిని రాజకీయ ప్రభావాలకు లోనుచేయకుండా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రజలకు న్యాయం అందించే దిశగా నిరంతరాయంగా కొనసాగించాలన్నారు. భారత రాజ్యాంగం మేము, భారత ప్రజలు అనే పదాలతో ప్రారంభమవుతుందని గుర్తుచేస్తూ, సమాజంలో వ్యక్తిగత స్వార్థం బదులుగా సామూహిక భావనను పెంపొందించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. సమాజంలోని విభిన్న వర్గాల మధ్య సమన్వయం, న్యాయం, సమానత్వం సాధించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలన్నారు.జిల్లా కోర్టులకు ప్రాథమిక

హక్కుల పరిరక్షణ అధికారం ...

జిల్లా కోర్టులకు ప్రాథమిక హక్కుల పరిరక్షణ అధికారం కల్పిస్తే న్యాయం మరింత చేరువ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ద్వారా ప్రాథమిక హక్కుల అమలు కోసం నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని జస్టిస్ నరసింహ వివరించారు. ఆర్టికల్ 32(3) ప్రకారం, ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ఇతర న్యాయస్థానాలకు కూడా అధికారాలను కల్పించే అవకాశం పార్లమెంటుకు ఉందన్నారు.

రాజ్యాంగంలో నిర్దేశించిన దిశగా జిల్లా కోర్టులకు కూడా ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించిన అధికారాలు కల్పించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. , .

ముఖ్యమంత్రి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సైతం ఆదేశాలు జారీ చేసే స్థాయిలో జిల్లా న్యాయస్థానాల పరిధి విస్తరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

న్యాయ పాలనలో బార్ -- బెంచ్ పరస్పర స్వతంత్రత కు కట్టుబడాలి

ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 28: జిల్లా న్యాయస్థానం 222 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ 131 ఏళ్ల విశిష్ట ప్రస్థానం ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ న్యాయవ్యవస్థకు గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ అన్నారు. రెండు శతాబ్దాలకు పైగా న్యాయవ్యవస్థ కొనసాగడం చరిత్ర కాదని, న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే సామాన్య ప్రజల విశ్వాసానికి ప్రతీక అన్నారు. పవిత్ర గోదావరి తీరంలో, చారిత్రక నన్నయ అడుగుజాడలు గల ఈ నేలపై నిర్వహిస్తున్న ఈ వేడుక విశిష్టమైనదన్నారు.ఈ సందర్భంగా వేడుకులకు హాజరైన సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయ మూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్రముఖులకు స్వాగతం పలికారు.

రెండు శతాబ్దాల న్యాయ వ్యవస్థ ప్రస్థానాన్ని స్మరించుకుంటున్న ఈ సందర్భంలో, న్యాయస్థానాల గడప తొక్కే సామాన్య ప్రజల విశ్వాసాన్ని గుర్తుచేసుకోవడం ముఖ్యమని జస్టిస్ లిసా గిల్ అన్నారు. ఎన్నో కష్టాలు, సమస్యలపై న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే ప్రజలకు ఈ వ్యవస్థలో నిజం గెలుస్తుందనే నమ్మకం ఉంటుందన్నారు. న్యాయం, రాజ్యాంగ విలువలు, చట్ట పాలన నిలబడతాయనే విశ్వాసాన్ని న్యాయవ్యవస్థ కల్పించాలని తెలిపారు. రెండు శతాబ్దాలుగా ప్రజలు న్యాయవ్యవస్థపై ఉంచిన విశ్వాసానికి నివాళిగా నిలుస్తుంద న్నారు. 1804 లో రాజమహేంద్రవరంలో న్యాయస్థానం దక్షిణ భారతదేశంలోని తొలి శాశ్వత న్యాయస్థానాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. బ్రిటిష్ వలస పాలన కాలం, స్వాతంత్ర్య పోరాటం, భారత గణతంత్ర ఆవిర్భావం, ఆధునిక డిజిటల్ యుగం వంటి అనేక చారిత్రక పరిణామాలకు ఈ న్యాయస్థానం సాక్షిగా నిలిచిందన్నారు. 222 ఏళ్ల కాలంలో 150 మంది ప్రధాన జిల్లా న్యాయమూర్తులు ఈ న్యాయస్థానంలో సేవలందించడం విశేషమన్నారు. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు తరాలుగా న్యాయ సేవలను కొనసాగిస్తూ సంస్థ ప్రతిష్టను నిలబెట్టార న్నారు.131 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సంస్థ న్యాయవ్యవస్థకు మేధోపర, నైతికపర బలాన్ని అందిస్తూ వచ్చిందని ప్రశంసించారు.బార్ బెంచ్ మధ్య సంబంధాలు పరస్పర గౌరవం, వృత్తిపర మర్యాద, చట్ట పాలన పట్ల నిబద్ధతపై ఆధారపడి ఉంటాయని తెలిపారు. న్యాయ పరిపాలనలో బార్ అసోసియేషన్ కీలక భాగస్వామి అని, రాజమహేంద్రవరం బార్ స్వతంత్రంగా, సమర్థంగా, నిర్భయంగా, పరిణితితో వ్యవహరిస్తూ న్యాయవ్యవస్థకు సహకారం అందిస్తోందని అభినందించారు.ఈ ప్రాంతం జస్టిస్ వీరస్వామి, జస్టిస్ జగన్నాథరావు న్యాయమూర్తులను, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు మహనీయులను అందించిందని గుర్తుచేశారు. జూనియర్లకు తరతరాలు గా అందుతున్న ప్రతిభ, విలువలు, వృత్తి నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. గత వైభవాన్ని కాపాడు కుంటూ భవిష్యత్తు సాంకేతికతకు సిద్ధం కావాలన్నారు సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ వ్యవస్థలు, క్వాంటం టెక్నాలజీ వంటి కొత్త పరిణామాలు నేడు న్యాయవ్యవస్థలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకున్నాయని తెలిపారు.కొత్త సాంకేతికతను స్వీకరించడం అవసరమని, అయితే దాని ప్రభావానికి లోనై వ్యవస్థను సాంకేతికతకు బానిసగా మార్చుకోకుండా, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. న్యాయవాదులు. తెర వెనుక నిరంతరం కృషి చేస్తూ సంస్థలు ప్రజలకు సమర్థవంతంగా పనిచేస్తున్న వారి సేవలు ప్రశంసనీయమని తెలిపారు.ఈ చారిత్రక వేడుకను విజయవంతం చేసేందుకు కృషి చేసిన హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా న్యాయవ్యవస్థ, జిల్లా యంత్రాంగం, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. న్యాయం గెలవాలని, ధర్మం విజయం సాధించాలని ఆకాంక్షించారు. న్యాయం, ధర్మం రెండూ కలిసినప్పుడే సమాజం సరైన మార్గంలో ముందుకు సాగుతుంద న్నారు. రాజమహేంద్రవరం న్యాయస్థానం, బార్ అసోసియేషన్ చారిత్రక విజయాన్ని భవిష్యత్తు తరాలు గుర్తుచేసు కోవాలని ఆకాంక్షించారు.

గొమ్ముగూడెం వైస్ సర్పంచ్ గా వైసిపీ అభ్యర్థి పాయం వెంకటరమణ



కుక్కునూర్ నవంబర్ 28 పెన్ పవర్ :ఏలూరు జిల్లా కుక్కునూర్ మండలం లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైసిపి హవా కొనసాగింది మండలంలోని గొమ్ముగూడెం పంచాయతీలో ఎన్నడు లేనివిధంగా వైసీపీ సత్తా చాటింది, వైస్ సర్పంచిగా పాయం వెంకటరమణ ని ఎన్నుకోవడం జరిగిందని పార్టీ శ్రేణులు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ గోమ్ముగూడెం పంచాయతీ సీనియర్ నాయకులు బలుమూరి శ్రీకాంత్, సేకపెల్లి వెంకటేశ్వర్లు, మడివి రమేష్, కొవ్వల సాయిబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షులు మాడకం మల్లేశ్వరరావు,కార్యకర్తలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాన్ని హై సెక్యూరిటీ జోన్ గా పరిగణించాలి

- రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ స్పందించాలి
- మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 28: గ్రేటర్ రాజమహేంద్రవరం ఎన్నికల ప్రక్రియ తోపాటు స్ట్రాంగ్ రూమ్ లో బ్యాలెట్ బాక్సులు భద్రపరిచడం లో అధికార యంత్రాంగం విఫలమైందని వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ, సిటీ నియోజకవర్గ ఇన్చార్జి మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. వైసిపి అభ్యర్థులకు అధికారులపై నమ్మకం లేదని స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాలను హై సెక్యూరిటీ జోన్ గా పరిగణించడంతో పాటు, బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన సీసీటీవీ వెబ్ కాస్టింగ్ లైవ్ తమకు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తే నగర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసేలా అధికారి యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ తీవ్రంగా ధ్వజమెత్తారు. స్థానిక వి ఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ లో వైసిపి సిటీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థులపై దారుణంగా బెదిరింపులకు పాల్పడుతున్నారని, అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వ్యాపారాలపై దాడులు చేయడం, బెదిరింపులకు దిగడం అన్యాయమన్నారు. రెండేళ్ల తర్వాత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, ప్రతి ఒక్కరిని చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎస్ కే వి టి లో స్ట్రాంగ్ రూమ్ వద్ద సెక్యూరిటీ లేదని, సీసీ కెమెరాలు పనిచేయడం లేదని , కనెక్షన్లులేవని వీడియోలు ప్రదర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ స్పందించి విచారణ జరిపించాలని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.10 ప్లస్ 2 భద్రత పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. 38వ డివిజన్ నుంచి వైసీపీ అభ్యర్థి పప్పుల సాయి లక్ష్మీప్రసన్న భర్త నాగేంద్ర మొబైల్ దుకాణాలపై జిఎస్టి అధికారులు దాడులు చేశారని, 34 డివిజన్లో కొత్త బాలమురళి కి మద్దతుగా నిలిస్తే వ్యాపారాలు అడ్డుకుంటామని బెదిరింపులు చేశారని ఆరోపించారు. నామినేషన్లు అడ్డుకున్నా రని, విత్ డ్రాలు చేసుకోవాలని , అభ్యర్థులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.వైసిపి అభ్యర్థులు గెలుస్తారనే భయంతో ఈవీఎం ఎమ్మెల్యే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తిరగటి సరస్వతి వార్డులో టిడిపి నాయకులు పోలింగ్ బూత్ లో రిగ్గింగ్ చేశారని ఆరోపించారు. పోలింగ్ రోజు వెబ్ కాస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసీపీ మేయర్ అభ్యర్థి దాసి వెంకటరావు పోటీ చేశారని కూటమికి ఓడిపోతారనే భయం పట్టుకుందని విమర్శించారు. నగర పోలీసుల తీరుపై డీజీపీ దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కొందరు పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు. టిడిపి నాయకులు వార్డుల్లో కోట్లు పంచి పెడుతుంటే అడ్డుకోకుండా కంబాలపేటలో టిడిపి వైసిపి అభ్యర్థి భర్త బాబీ ని 45 వేలు జేబులో ఉన్నాయని నెపంతో అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. అధికార దుర్వినియోగం, పోలీసుల అక్రమ కేసులపై తాము హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లి చట్టపరంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గోవిందగిరి ఆలయంలో భక్తుల సందడి



గంగవరం /రంపచోడవరం పెన్ పవర్ నవంబర్ 28: గోవిందగిరిలోని తిరుమల తిరుపతి దేవస్థానాల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐటీడీఏ ఏపీవో వెంకటరమణ దంపతులు అన్నదాన కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యక్రమాలను అధికారి అంచూరి శిరీష పర్యవేక్షించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్‌లో పూర్తి పారదర్శకత పాటించాలి



గొల్లప్రోలు/కాకినాడ, పెన్ పవర్, నవంబర్ 28:గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శనివారం గొల్లప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లు, సిబ్బంది విధులు, పోలింగ్ సామగ్రి పంపిణీపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ సామగ్రిని చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి స్వీకరించాలని, పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వెంటనే రహస్య ఓటింగ్ కంపార్ట్‌మెంట్, సిబ్బంది కూర్చునే ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తులతో కూడిన నోటీసు బోర్డులను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలన్నారు. రెండో విడత ఎన్నికల పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, నిర్ణీత సమయానికి పోలింగ్ ప్రారంభమయ్యేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన అనంతరం బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కించాలని తెలిపారు. సర్పంచ్, వార్డు సభ్యుల బ్యాలెట్ పత్రాలను వేర్వేరుగా విభజించి నిబంధనల ప్రకారం లెక్కింపు చేపట్టాలన్నారు. ప్రతి రౌండ్‌లో లెక్కించిన ఓట్ల వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటరీకరించి నమోదు చేయడం ద్వారా ఫలితాల క్రోడీకరణ వేగవంతంగా, పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు.కౌంటింగ్‌లో ప్రతి దశలోనూ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని, బ్యాలెట్ పత్రాల విభజన, ఓట్ల లెక్కింపు, ఫలితాల నమోదు సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ పర్యటనలో మెప్మా పీడీ, గొల్లప్రోలు మండల రిటర్నింగ్ అధికారి పి. శైలజ, మండల సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు కోడ్ ఆఫ్ కాండాక్ట్ వర్తించదా?



నేడే మండలంలో పంచాయతీ ఎన్నికలు

వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 28: మండలంలో నేడు రెండవ దఫా పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు ఏర్పాటు చేయడం జరిగింది. కానీ పంచాయతీ ఎన్నికలకు కోడ్ ఆఫ్ కాండాక్ట్ వర్తించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నిబంధనల నియమావళి ప్రకారం మండలంలో పలు ప్రభుత్వ ఆస్తులపై అభ్యర్థుల ఎన్నికల కరపత్రాలను అంటించడం జరిగింది. అక్కడ ఇక్కడ అని తేడా లేకుండా ప్రతి పంచాయతీ గ్రామాలలో ప్రభుత్వ ఆసులపై కరపత్రాలను అంటించారని పలువురు అంటున్నారు. ఎన్నికల నియమాల్ని పాటించవలసిన ప్రభుత్వ ఉద్యోగులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. నేడు ఎన్నికల పోలింగ్ జరగవలసిన ప్రతి పంచాయతీలో ప్రభుత్వ ఆస్తులపై కరపత్రాలు ఉన్నాయని తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీవో



వై రామవరం, పెన్ పవర్, నవంబర్ 28 : మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను శనివారం సాయంత్రం పరిశీలించడం జరిగిందని ఎంపీడీవో కే. బాపన్న దొర తెలిపారు. మండలంలో నేడు 12 పంచాయితీలలో జరిగే రెండవ సాధారణ ఎన్నికలకు సంబంధించిన సదుపాయాలు సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్, నవంబర్ 28: శనివారం ఎన్నికల మెటీరియల్ తో బయలుదేరిన సిబ్బందికి వాహన ప్రమాదం జరగడంతో ఘోర ప్రమాదం తప్పిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

వారు తెలిపిన వివరాల ప్రకారం మారేడుమిల్లి మండలం ఆకుమామిడి కోట మలుపు వద్ద ఎదురుగా వాహనాలు ఢీకొన్నాయని తెలిపారు. ఎన్నికల సిబ్బందిలో కొంతమంది గాయాలయ్యాయి అని ఏ విధమైన ప్రాణాపాయం జరగలేదని తెలిపారు. గుర్తేడు బయలుదేరిన ఎన్నికల వాహనం ఎదురుగా వస్తున్న వాహనాన్ని కొట్టిందని తెలిపారు. ఒక వాహనానికి రెండు టైర్లు పగిలిపోయాయని, ఇద్దరు పోలింగ్ సిబ్బందికి స్వల్ప గాయాలయ్యాయి అని తెలిపారు.

కత్తిపూడిలో వెన్నా పద్మావతి శివ ప్రచారానికి విశేష స్పందన....



- **ఎమ్మెల్యే సత్యప్రభ ఆశీస్సులతో కూటమి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో...**
- **ఉంగరం గుర్తుకు ఓటేయాలని ఇంటింటా అభ్యర్థన..**

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 28:- కాకినాడ జిల్లా శంఖవరం మండలం లో కత్తిపూడి కూటమి సర్పంచ్ అభ్యర్థి వెన్నా పద్మావతి శివ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆశీస్సులతో బరిలో నిలిచిన ఆమెకు రోజురోజుకూ ప్రజల నుంచి మద్దతు పెరుగుతోంది. రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను ప్రచారంలో పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. 3వ వార్డు అభ్యర్థి దేవర నాని, 4వ వార్డు అభ్యర్థి చిదగల వంశీతో కలిసి వెన్నా పద్మావతి శివ ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ కూటమి బలపరిచిన ఉంగరం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారానికి వచ్చిన నాయకులు, అభ్యర్థులకు మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ముఖ్యంగా జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను వీధిలో మహిళలు హారతులతో స్వాగతం పలకడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గతంలో వెన్నా శివ చేపట్టిన సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందుబాటులో ఉంటూ చేసిన సహాయ సహకారాలను వివరిస్తూ కూటమి నాయకులు ఓటర్ల మద్దతు కోరారు. కత్తిపూడి అభివృద్ధికి కట్టుబడి ఉంటామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని పద్మావతి శివ తరఫున భరోసా కల్పించారు. మహిళల స్వాగతాలు, స్థానికుల స్పందనతో ఎన్నికల ప్రచారం ఉత్సాహభరితంగా కొనసాగింది. ఈ ప్రచారంలో జడ్పీటీసీ కంచిబోయిన శ్రీను, కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, గ్రామ టీడీపీ అధ్యక్షులు కేళంగి జన, ఎంపీటీసీ ఆలపు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సాధనాల లక్ష్మిబాబు, దేశీలంక వెంకటరమణ, గౌతు కన్నారావు, జ్యోతుల శివ, నక్కా శ్రీను, గజ్జి సుబ్బరాజు, దేవర రామకృష్ణ, గ్రంధి చక్రి, కోలా వెంకట్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనసీమ తిరుమల వాడపల్లికి భక్తుల పోటెత్తు

వైభవంగా స్వామివారి సుప్రభాత సేవ.. తొలి హారతి దర్శనంతో భక్తులకు దివ్యదర్శనం



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 28:కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి స్వయంభు దివ్యక్షేత్రానికి తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శనివారం వేకువజామునే అలివేలుమంగా పద్మావతి సమేతంగా కొలువుదీరిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. భక్తజనుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఉదయాన్నే ఆలయ అర్చకులు స్వామివారికి మేలుకొలుపు సేవ, సుప్రభాత సేవ, అలంకార ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. అనంతరం తొలి హారతి దర్శనంతో భక్తులకు స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకునే భాగ్యం కల్పించారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గౌతమి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ మాడ వీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు, క్యూలైన్లు, ఇతర సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉపకమిషనర్ నల్ల సూర్యచక్రధర్ రావు తెలిపారు. భక్తుల రాకతో వాడపల్లి క్షేత్రం గోవింద నామస్మరణతో మార్మోగింది.

జగ్గంపేటలో మహాత్మ జ్యోతిరావు పూలేకు నివాళులు



జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 28: మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జగ్గంపేట పరివర్తన స్థలంలో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ టివిఎస్ రంగారావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూలే 1890 నవంబరు 28న పుణెలో మరణించారు. 1848లో సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి పుణెలో బాలికల కోసం తొలి పాఠశాలను స్థాపించారు. కుల వ్యవస్థ, అంటరానితనం, అసమానతలకు వ్యతిరేకంగా 1873 సెప్టెంబరు 24న సత్యశోధక్ సమాజ్‌ను నెలకొల్పారు. గులాంగిరి, సార్వజనిక్ సత్యధర్మ పుస్తకం.వితంతు పునర్వివాహాలు, అణగారిన వర్గాలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాడి బాబురావు, వివిఎస్ఎన్ మూర్తి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కి పూలే సేవలు యువతకు ఆదర్శం కావాలి.



ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 28: అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే సేవలు యువత కు ఆదర్శం కావాలని వెనుకబడిన వర్గాల నాయకుడు అలమండ చలమయ్య అన్నారు.మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా పట్టణంలో బడుగు బలహీన వర్గాల సమావేశం శనివారం నిర్వహించారు. తొలుత జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కి జ్యోతిరావు పూలే చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం భారత రాజ్యాంగంలో ఉన్న పార్లమెంట్, రాజ్యసభ స్థానాలను వెనుకబడిన వర్గాలకు 50 శాతం పెంచే కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపట్టాలని కోరారు.మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని పార్లమెంట్‌లో తీర్మానం చేస్తున్నప్పటి, అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీలు ఎంతమంది ఉన్నారో బీసీ జనాభా గణాంకాల ప్రకారం రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని అన్నారు.బీసీలకు జనాభాకు తగ్గ రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తేనే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అలమండ వెంకట దుర్గాప్రసాద్, తొండరపు రాంబాబు, బంక కోదండరాం, బూర్ల సత్తిబాబు, కడిం శెట్టి వాసు, ధనేటి చిన్న, పైల శ్రీధర్, తూరోతు గురయ్య తదితర బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.?

తోమాల సేవకులకు జనార్దనస్వామి చిత్రపటం అందజేత



ఆలమూరు,పెన్ పవర్ నవంబర్ 28:నవ జనార్దన ఆలయాల్లో నాలుగవ క్షేత్రమైన ఆలమూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ నవ జనార్దన ఆలయంలో శనివారం తోమాల సేవ నిర్వహించిన ఆలమూరు వాస్తవ్యులు నల్ల ఆదినారాయణమూర్తి, అనంతలక్ష్మి సత్యవతి దేవి దంపతులకు ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఈవో నరేంద్ర కుమార్ జనార్దన స్వామి చిత్రపటాన్ని అందజేశారు. తోమాల సేవతో పాటు నేడు ప్రసాద వితరణ సైతం వారి సౌజన్యంతోనే జరిగిందన్నారు. వారిని అభినందించారు.

ఏలేశ్వరంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద సంతర్పణ.



ఏలేశ్వరం, పెన్ పవర్,నవంబర్ 28: స్థానిక ల శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కొలువైన కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మాచారి నాగ మృత్యుంజయ శర్మ ఆధ్వర్యంలో శనివారం అన్నప్రసాద సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు శర్మ మాట్లాడుతూ శుక్రవారం విశ్వేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని, అనంతరం శనివారం సుమారు ఐదు వేల మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, మహిళలు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేశారు.

కాజులూరులో పంచాయతీ ఎన్నికలకు భారీ పోలీసు బందోబస్తు



కాజులూరు, పెన్ పవర్, నవంబర్ 28:కాజులూరు మండలంలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఏఆర్ డీఎస్పీ శ్రీహరి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, పది మంది ఎస్సైలు, 200 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అతి సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన కాజులూరు, పల్లెపాలెం గ్రామాల్లో ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాలైన కోలంక, మంజేరు, శలపాక, శీల గ్రామాల్లో అదనపు పోలీసు సిబ్బందిని కేటాయించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా ఉంటూ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు



పంపిణీ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఆర్డీఓ, డీడీఓ

సిబ్బందికి అందుబాటులో ఎన్నికల సామగ్రి.. ఏర్పాట్లపై అధికారుల సమీక్ష

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 18:గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఎన్నికల నిర్వహణలో కీలకమైన పోలింగ్ సామగ్రి పంపిణీ, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రం (డిస్ట్రిబ్యూషన్ సెంటర్), కౌంటింగ్ కేంద్రాలను రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి. సత్యనారాయణ, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కె. సురేష్ కుమార్ సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను అధికారులు సమగ్రంగా సమీక్షించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని క్రమపద్ధతిలో అందుబాటులో ఉంచిన తీరును, విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులు (పీఓలు), ఇతర పోలింగ్ సిబ్బందికి ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఓటరు జాబితాలు, ఇతర కీలక ఎన్నికల సామగ్రిని అందజేసే పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ సామగ్రి పంపిణీ అత్యంత కీలకమైన ఘట్టమని, ఈ దశలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి పోలింగ్ కేంద్రానికి కేటాయించిన సామగ్రిని సరిచూసుకుని సంబంధిత సిబ్బందికి అందజేయడం అవసరమని అధికారుల పరిశీలన ద్వారా స్పష్టమైంది. ఎన్నికల విధులకు నియమితులైన సిబ్బందికి అవసరమైన అన్ని వస్తువులు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.అనంతరం కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన అధికారులు ఓట్ల లెక్కింపు నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన గదులు, కౌంటింగ్ టేబుళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణలో పోలింగ్ ఎంత ముఖ్యమో, ఓట్ల లెక్కింపు కూడా అంతే కీలకమని, కౌంటింగ్ ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ, నిబంధనల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఈ పరిశీలనలో అధికారులు స్పష్టం చేశారు.గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తాయని, గ్రామీణ ప్రజలు తమకు నచ్చిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటం అధికారుల బాధ్యతగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సామగ్రి పంపిణీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను సమన్వయంతో నిర్వహించేందుకు రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు, తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, మాస్టర్ ట్రైనర్లు ఎస్.వి.ఎస్. ప్రసాద్, వాసుకి తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం డ్రాగన్ బోట్ ఫెస్టివల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు!



- **ఐకెసిఏ అధికారిక ఆమోదంతో వార్షిక క్రీడా వేడుకకు ప్రత్యేక గుర్తింపు**
- **ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు గుర్తింపు ఉత్తర్వుల సమాచారం..**
- **నిర్వాహకులకు అభినందనలు**

ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 28:కోనసీమ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఆత్రేయపురం డ్రాగన్ బోట్ ఫెస్టివల్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రతి ఏడాది సంక్రాంతి సంబరాల్లో భాగంగా గోదావరి నదీ తీరంలో నిర్వహించే ఈ జలక్రీడా పోటీలకు ఇండియన్ కయాకింగ్ అండ్ కెనోయింగ్ అసోసియేషన్ (ఐకెసిఏ) అధికారికంగా ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయడం విశేషంగా మారింది. ఈ గుర్తింపుతో ఆత్రేయపురం డ్రాగన్ బోట్ ఫెస్టివల్‌కు జాతీయ క్రీడా రంగంలో ప్రత్యేక స్థానం లభించనుంది.కెనోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సీకేఏఏపీ) చేసిన విజ్ఞప్తిని పరిశీలించిన ఐకెసిఏ, ఆత్రేయపురంలో నిర్వహించే డ్రాగన్ బోట్ ఫెస్టివల్‌ను వార్షిక ఈవెంట్‌గా నిర్వహించేందుకు అధికారిక అనుమతులు మంజూరు చేసింది. ఈ విషయాన్ని ఐకెసిఏ జాయింట్ సెక్రటరీ, వాటర్ స్పోర్ట్స్ ప్రెసిడెంట్ బలరామ నాయుడు, జిల్లా పర్యాటక అధికారి అన్వార్ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును వాడపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి వెల్లడించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి గుర్తింపునకు సహకరించిన సంబంధిత క్రీడా సంస్థలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.ప్రతి సంవత్సరం జనవరి 13 నుంచి 15వ తేదీ వరకు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆత్రేయపురం డ్రాగన్ బోట్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఇకపై ఈ పోటీలను ఐకెసిఏ నిర్దేశించిన నియమ నిబంధనలు, క్రీడా ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించాల్సి ఉంటుంది. జాతీయ క్రీడా సంస్థ అధికారిక ఆమోదం లభించడంతో పోటీల నిర్వహణలో ప్రమాణాలు, క్రీడాకారుల భాగస్వామ్యం, పోటీల నిర్వహణ విధానాలకు మరింత ప్రాధాన్యత ఏర్పడనుంది.గోదావరి నదీ అందాలు, కోనసీమ ప్రకృతి సోయగాల నడుమ జరిగే ఈ జలక్రీడా సంబరాలు ఇప్పటికే స్థానిక ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఇప్పుడు జాతీయ స్థాయి గుర్తింపు లభించడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా క్రీడాకారులు, జలక్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువత పాల్గొనేందుకు అవకాశాలు విస్తరించనున్నాయి. డ్రాగన్ బోట్‌తో పాటు కయాకింగ్, కెనోయింగ్ వంటి జలక్రీడలకు ఆంధ్రప్రదేశ్‌లో మరింత ప్రోత్సాహం లభించే దిశగా ఈ గుర్తింపు దోహదపడుతుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఆత్రేయపురం డ్రాగన్ బోట్ ఫెస్టివల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు రావడం ఆనందకరమన్నారు. సంక్రాంతి సంప్రదాయ వేడుకల్లో భాగంగా ప్రారంభమైన ఈ క్రీడా సంబరాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంతో పాటు యువతలో క్రీడల పట్ల ఆసక్తి, అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం రాబోయే డ్రాగన్ బోట్ ఫెస్టివల్ నిర్వహణకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. పోటీల నిర్వహణ, అవసరమైన ఏర్పాట్లు, క్రీడాకారుల భాగస్వామ్యం, కార్యక్రమ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం మండల పార్టీ అధ్యక్షుడు కూసం పూడి రామకృష్ణరాజు, దండు శివ, వేత్స అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలిలో హోరాహోరీగా కూటమి ఎన్నికల ప్రచారం

- **గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రజల్లోకి కూటమి అభ్యర్థులు**
- **కత్తెర గుర్తుపై ఓటు వేసి మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణను గెలిపించాలని విజ్ఞప్తి**



ఆత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 28:ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. ఆదివారం జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ప్రధాన రాజకీయ పక్షాలు తమ ప్రచార వేగాన్ని పెంచాయి. గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి వార్డులో అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిని మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణ తన ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు.మాజీ సర్పంచ్ పేర్చర్ల పల్లంరాజు వర్మ సమక్షంలో గ్రామంలోని 16 వార్డులకు చెందిన కూటమి అభ్యర్థులతో కలిసి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ గ్రామ సమస్యలను తెలుసుకుంటూ తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణకు కేటాయించిన కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు కేవలం పదవుల కోసం జరిగే ఎన్నికలు మాత్రమే కాకుండా గ్రామ భవిష్యత్తు, అభివృద్ధి దిశను నిర్ణయించే కీలకమైన ప్రక్రియగా అభివర్ణించారు. గ్రామంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామాభివృద్ధికి కృషి చేసే అభ్యర్థులను ఆదరించాలని కోరారు.సర్పంచ్ అభ్యర్థితో పాటు కూటమి తరపున బరిలో ఉన్న 16 మంది వార్డు సభ్యుల అభ్యర్థులను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రచారంలో భాగంగా ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని వార్డుల అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ వారి మద్దతు కూడగట్టేందుకు విస్తృతంగా ప్రచారం సాగించారు.

ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది. ప్రధాన కూడళ్లు, వీధులు, కాలనీల్లో నాయకులు, కార్యకర్తల ప్రచారంతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ఓటర్లను వ్యక్తిగతంగా కలుసుకుంటూ తమ అభ్యర్థుల విజయానికి మద్దతు కోరుతున్నారు. ముఖ్యంగా గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలు ప్రచారంలో ప్రధాన చర్చనీయాంశాలుగా మారాయి.

ఈ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిని మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణతో పాటు 16 వార్డుల కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటర్లను తమ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

సీట్లు పెరిగితే ఏపీలో అధికారానికి ఆ రెండు రీజియన్స్ కీలకం !

డీలిమిటేషన్‌తో ఏపీలో అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263కు పెరగవచ్చనే అంచనాలు రాజకీయ చర్చకు దారితీస్తున్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు మ్యాజిక్ ఫిగర్ 132కు, ప్రధాన ప్రతిపక్ష హోదాకు అవసరమైన సంఖ్య 27కు చేరుతుందని కథనంలో పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల్లో కలిపి 102 సీట్లు, కృష్ణా--గుంటూరులో 49 స్థానాలు కీలకంగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు.

డీలిమిటేషన్ తో ఏపీలో పెద్ద ఎత్తున అసెంబ్లీ సీట్లు పెరగనున్నాయి. దేశం సంగతి పక్కన పెడితే ఏపీ రాజకీయాల మీద ఇప్పుడు చర్చ అంతా సాగుతోంది. ఎందుకంటే ఢీ అంటే ఢీ అన్నట్లుగా ఏపీ పాలిటిక్స్ ఉంటుంది. రాజకీయ ప్రత్యర్థుల స్థాయి దాటి మరీ సాగే ఈ రాజకీయ భీకర సమయం మీద దేశమంతా ఆసక్తిని ప్రదర్శిస్తూ ఉంటుంది. దీంతో పాటు ఏపీకి ఒక ట్రాక్ రికార్డు ఉంది. ఒక ఎన్నికలో ఒక పార్టీని గెలిపించిన జనాలు మరో ఎన్నికల్లో ఇంకో పార్టీని గెలిపిస్తూ వస్తూంటాయి. ఇలా చూస్తే విభజన తరువాత జరిగిన మూడు ఎన్నికల్లోనూ ఇదే సాగింది. ఈ లెక్కన 2029 లో విజయం మాదే అని వైసీపీ ధీమా పడుతోంది. ఆ ట్రాక్ రికార్డ్ ని రివర్స్ చేయాలని కూటమి పట్టుదలగా ఉంది. ఈ క్రమంలో డీలిమిటేషన్ వల్ల పెరిగే సీట్లు ఏపీ రాజకీయాన్ని మార్చేసేలా కనిపిస్తున్నాయని అంటున్నారు.

ఏ జిల్లాలో ఎన్ని సీట్లు :

ఇక డీలిమిటేషన్ బిల్లులో ఆసెంబ్లీలలో ప్రస్తుతం ఉన్న సీట్లకు అదనంగా మరో యాభై సీట్లు పెంచుతారని అంటున్నారు. అదే జరిగితే ఏపీలో ఇప్పుడు ఉన్న 175 సీట్లు ఒక్కసారిగా పెరిగి 263 గా బిగ్ నంబర్ అవుతుంది. అయితే ఏ జిల్లాలో సీట్లు ఎంత పెరుగుతాయన్నది చూస్తే అంచనా వివరాలు చాలా ఆసక్తికరంగానే ఉన్నాయి. ఇందులో కొన్ని జిల్లాలలో ఉన్న ఎక్కువ సీట్లు మరింతగా పెరిగి ఏపీ రాజకీయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయవచ్చు అని అంటున్నారు.



జిల్లాల వారీగా లెక్క :

ఇక చూసే కనుక పాత ఉమ్మడి జిల్లాల ప్రకారంగా అనంతపురం జిల్లాలో 14 స్థానాలు 21 స్థానాలు కానున్నాయి. కర్నూలు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు 21 స్థానాలు కానున్నాయి. కడప జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలు 15కు, చిత్తూరు జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలు 21కి, నెల్లూరు జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు 15కు, ప్రకాశం జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు 18కి గుంటూరు జిల్లాలో 17 అసెంబ్లీ స్థానాలు 25కు, కృష్ణా జిల్లాలో 16 అసెంబ్లీ స్థానాలు 24కు, తూర్పుగోదావరి జిల్లాలో 19 అసెంబ్లీ స్థానాలు 28 కి, పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు 22 కు పెరగనున్నాయి. అలాగే విశాఖపట్నం జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు 23 కు విజయనగరం జిల్లాలో 9 అసెంబ్లీ స్థానాలు 15 కు శ్రీకాకుళం జిల్లాలో 10 అసెంబ్లీ స్థానాలు 15కు పెరగనున్నాయి. ఇలా ఏపీలో 88 అదనంగా ఎమ్మెల్యే సీట్లు రానున్నాయి.

మ్యాజిక్ ఫిగర్ ఇదే :

ఇక మరో ముఖ్య విషయం ఏంటి అంటే ఏపీలో ప్రస్తుతం అధికారం అందుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 88గా ఉంది. అదే 263 సీట్లు అయ్యాక అధికారం దక్కించుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 132 అవుతుంది అని అంటున్నారు. అంటే ఏ పార్టీ అయినా కంఫర్టబుల్ మెజారిటీ సాధించాలంటే ఈ నంబర్ అవసరం అన్న మాట. ఇక ఇప్పటిదాకా చూస్తే ఏపీలో విపక్ష హోదా దక్కాలీ అంటే 18 సీట్లు రావాల్సి ఉంది. కానీ కొత్తగా సీట్లు పెరిగితే మాత్రం ఈ నంబర్ 27 కి చేరుకుంటుంది. అన్ని సీట్లు వస్తేనే ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించరన్న మాట.

ఆ రెండు రీజియన్లు చాలు :

మరో ముఖ్య విషయం ఇక్కడ ఉంది. ఏపీలో అధికారం మారేది ఎప్పుడూ ఉత్తరాంధ్రా ఉభయ గోదావరి జిల్లాల మీదనే ఆధారపడి అన్నది తెలిసిందే. ఎందుకంటే ఇప్పటిదాకా చూస్తే ఈ రెండు రీజియనల్లో చెరి 34 సీట్లు ఉన్నాయి. అంటే మొత్తం 68 సీట్లు అన్న మాట. వాటిని దక్కించుకున్న వారికే అధికారం చేరువ అవుతుంది. ఇపుడు కూడా అదే ట్రెండ్ కంటిన్యూ అవుతుంది అని అంటున్నారు. ఈ రెండు రీజియనల్లో కొత్తగా పెరిగే సీట్లతో చెరి 51 సీట్లుగా మారి మొత్తం 102 సీట్లు అవుతాయన్న మాట. దీంతో ఏ పార్టీకి కానీ కూటమికి కానీ ఆధిక్యత దక్కుతుందో వారే అధికారంలోకి సులువుగా వచ్చే చాన్స్ ఉంటుందని అంటున్నారు. మరో వైపు చూస్తే క్రిష్ణా, గుంటూరు జిల్లాలలో పునర్ విభజన తరువాత 49 సీట్లు అవుతాయి. అంటే ఈ వచ్చే ఎన్నికల్లో ఈ సీట్లు కూడా ముఖ్య భూమిక పోషిస్తాయన్న మాట. మరి ఏపీలో వైసీపీ కూటమిలలో ఈ రీజియన్లలో ఎవరికి ఎంత పట్టు ఉంది, ఎంత ఆధిక్యం చూపిస్తాయన్న దాని మీదనే ఏపీ రాజకీయం ఆధారపడి ఉందని అంటున్నారు.

కూటమి వర్సెస్ వైసీపీ : సీట్లు పెరిగితే ఎవరికి లాభం ?

డీలిమిటేషన్‌తో ఏపీలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు 50 శాతం పెరిగితే 2029 ఎన్నికల రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. మూడు పార్టీల కూటమిలో సీట్ల పంపకాల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. పెరిగిన స్థానాలు వైసీపీకి సవాలుగా మారతాయని కూటమి వర్గాల అంచనా. అయితే ప్రజాదరణ ఉంటే సీట్ల పెంపు ప్రభావం చూపదని వైసీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలో ఒక్కసారిగా 50 శాతం సీట్లు అటు లోక్ సభ ఇటు అసెంబ్లీలలో పెరుగుతాయి. దాంతో రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రమే మారిపోతుంది. ఇప్పటిదాకా చూసిన అనేక నియోజకవర్గాల రూపు రేఖలు మారిపోతాయి. అలాగే కొత్తవి పుట్టుకుని వస్తాయి. పెద్దవి బద్ధలు అయి రెండు మూడుగా మారిపోతాయి. ఇందులో మూడవ వంతు మహిళలకు రిజర్వ్ అవుతాయి. ఇలా అనేక లెక్కలు ఇందులో ఇమిడి ఉంటాయి. ఇవన్నీ కూడా రాజకీయాల మీద తీవ్ర ప్రభావం చూపించడం ఖాయమని అంటున్నారు.

ఢీ అంటే ఢీగా :

ఏపీలో రాజకీయం చూస్తే ఢీ అంటే ఢీ అన్నట్లుగా వాతావరణం ఉంటుంది. అటు కూటమిలో పార్టీలు మూడు ఉన్నాయి. టీడీపీ టాప్ టూ బాటమ్ బలం ఉన్న అతి పెద్ద పార్టీ, జనసేన రెండవ అతి పెద్ద పార్టీగా కూటమిలో ఉంది. బీజేపీ జాతీయ పార్టీ. ఈ మూడు పార్టీలు కలిస్తే జరిగేది ఏమిటి అన్నది 2024 ఎన్నికలు రుజువు చేశాయి. అయితే ఆనాడు త్యాగాలతో భారాలతో పొత్తులు కుదిరాయి. 2029 ఎన్నికలకు ఈ బాకీలు అన్నీ ఉన్నాయి. ఎలాగా అన్న చింత కూటమిలో ఉంది. అలాంటి సమయంలో డీలిమిటేషన్ తో సీట్లు మరో యాభై శాతం పెరుగుతాయి అంటే అది కచ్చితంగా కూటమికి మేలు చేసే వ్యవహారమే అని అంటున్నారు. మూడు పార్టీల ఆకాంక్షలను తీర్చుకుంటూ కలసికట్టుగా 2029 ఎన్నికలను ఫేస్ చేయడానికి ఈ సీట్ల పెంపు ఎంతో దోహదపడుతుంది. అంతే కాదు కూటమి మూడు పార్టీలలో ఉన్న అనేక మంది ఆశావహుల కోరికలు



కూడా తీర్చనుంది. ఒక విధంగా కూటమిలో పెద్ద ఎత్తున సాగుతాయనుకునే సీట్ల పేచీలకు చెక్ పెట్టేసేలా డీలిమిటేషన్ ఒక అమృత హస్తంగా మారుతుందని విశ్లేషిస్తున్నారు.

వైసీపీకి ఇబ్బందేనా :

ఇక చూస్తే వైసీపీకి ఈ డీలిమిటేషన్ వల్ల ఇబ్బంది అవుతుందా అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఎందుకంటే కూటమి విడిపోక పోయినా లుకలుకలు కనుక ఉంటే అవి 2029 నాటికి పెరిగి పెద్దవి అయితే గ్రౌండ్ లెవెల్ లో అవి రివర్స్ గా పనిచేసి వైసీపీకి భారీ అడ్వాంటేజ్ అవుతుంది అని ఒక అంచనా ఉంది. కూటమిలో అంతా ఒక్క త్రాటి పైకి రావాలంటే సీట్ల పేచీ తేలాలి. ఇపుడు డీలిమిటేషన్ పుణ్యమాని ఆ తలనొప్పి కూటమికి తప్పుతుంది. మరి ఈ విధంగా చూస్తే వైసీపీ మీద ఏకమొత్తంగా అంతా కలసి దూసుకుని వస్తారు. పైగా ఎన్నికల వేళకు వైసీపీలోకి కూటమిలో ఇమడలేని వారు వస్తారన్న ఊహాగానాలు ఉన్నాయి. అవి కూడా ఇప్పుడు తల్ల కిందులు అవుతాయని అంటున్నారు. ఇంకో వైపు వైసీపీకి 175 అసెంబ్లీ సీట్లలోనే సరైన ఇంచార్జిలు లేరని అంటున్నారు. ఆ సంఖ్య కనుక 263గా పైరిగితే సమర్థులైన వారిని వెతికి తెచ్చిపెట్టి ఎన్నికల్లో కూటమిని ఢీటుగా ఎదుర్కోవడం కష్టం గానే మారుతుందని అంటున్నారు.

ప్రజా తీర్పు మారదా :

అయితే దీని మీద వైసీపీ వాదన భిన్నంగా ఉంది. ఒక్క సీటు రెండు అయితేనేమిటి మూడు అయితేనేమిటి. ఎందరు వచ్చి పోటీ పడినా ఎంత కూటమిగా కట్టినా ప్రజలలో మార్పు అన్నది వస్తే కనుక ఓడించాలని నిర్ణయిస్తే కనుక ఇవేమీ నిలబడవు అని అంటున్నారు. ఇక వైసీపీ వైపు వేవ్ ఉందని తెలిస్తే కూటమిలో సీట్లు ఇస్తామని అన్నా కూడా తమ వైపే వస్తారు అని కూడా అంటున్నారు. అలా వైసీపీకి ప్రజాదరణ మొగ్గు జగన్ పాదయాత్ర తరువాత పూర్తిగా వెల్లడి అవుతుందని అందుకే డీలిమిటేషన్ అన్నది తమకు ఇబ్బంది కాదనే ఆ పార్టీ నేతలు ధీమా పడుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

చీపురుపల్లి మీద కన్ను... బొత్సతో చిన్న శ్రీను డైరెక్ట్ ఫైట్ ?



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన చిన్న శ్రీనుకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి ఆయనకు దక్కవచ్చని, 2029 ఎన్నికల్లో బొత్స సత్యనారాయణ సొంత నియోజకవర్గం చీపురుపల్లి నుంచి పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. విజయనగరం జిల్లా రాజకీయాలలో రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతూ పట్టు సాధించిన వారు చిన్న శ్రీను. ఆయన కాంగ్రెస్ వైసీపీలలో ఉన్నపుడు జిల్లాలో అతి ముఖ్య పాత్ర పోషించారు. ఆయనకు ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ అణువణువూ తెలుసు. అన్ని చోట్లా ఆయన అనుచర గణం ఉన్నారు. ఆయన అభిమాన జనం ఉన్నారు. ఇక అంగబలం అర్థబలం విషయంలో చిన్న శ్రీనుకు ధీటైన నేత లేరని అంటున్నారు. వ్యూహ రచనలో ఆయన బొత్సకు సరిసాటి అని చెబుతున్నారు. ఇవన్నీ తెలిసిన మీదటనే ఆయనను వైసీపీ నుంచి దూరం చేసి టీడీపీ అక్కున చేర్చుకుంది. రానున్న రోజులలో చిన్న శ్రీనుకు టీడీపీలో మరింత కీలక పాత్ర దక్కుతుందని ప్రచారంలో ఉంది.

జిల్లా అధ్యక్షుడిగా ;

ఎటూ స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసాయి. ఇక జిల్లాలో పార్టీని గాడిన పెడుతూ 2029 నాటికి సిద్ధం చేయాల్సి ఉంది. అందుకే టీడీపీ చిన్న శ్రీనుకు జిల్లా పగ్గాలు అప్పగిస్తుంది అని అంటున్నారు. ప్రస్తుతం ఈ బాధ్యతలను కిమిడి నాగార్జున చూస్తున్నారు. ఆయనకు డీసీసీబీ చైర్మన్ పదవి ఇచ్చారు. అలా జోడు గుర్రాల స్వారీ ఆయన చేస్తున్నారు. దాంతో ఇపుడు చిన్న శ్రీనుకు జిల్లా బాధ్యతలను అప్పగిస్తే ఆయన మరింత మంది వైసీపీ నేతలను టీడీపీ గూటికి రప్పిస్తారని వైసీపీ గుట్టూ మట్టూ ఎరిగిన నేతగా ఆయన జిల్లా పదవిలో ఉంటే ఎంతో రాజకీయ లాభం సమకూరుతుందని కూడా పార్టీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు.

బొత్స ఇలాకాలోనే :

ఇక జిల్లా అధ్యక్ష బాధ్యతలు కనుక చిన్న శ్రీను తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన ఎక్కడ నుంచి పోటీ చేయాలనుకున్నా చేయగలరు అని అంటున్నారు. అయితే చిన్న శ్రీను కన్ను చీపురుపల్లి మీద ఉందని అంటున్నారు. అది వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సొంత ఇలాకా. ఆయన అయిదు సార్లు పోటీ చేసి మూడు సార్లు గెలిచారు. గెలిచిన ప్రతీ సారీ మంత్రి కూడా అయ్యారు. అలా ఆయనకు రాజకీయ సెంటిమెంట్ కూడా ఈ సీటు. అయితే చిన్న శ్రీనుకు కూడా అక్కడ బంధు గణం అనుచర గణం దండీగానే ఉంది అని అంటున్నారు. అందువల్ల 2029 ఎన్నికలలో అక్కడ నుంచే ఆయన పోటీ చేస్తారు అని ఊహాగానాలు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి.

కిమిడికి చెక్ చెబుతారా :

సిట్టింగ్ ఎమ్మెల్యే మాజీ మంత్రి కిమిడి కళా వెంకట రావుకు చెక్ చెబుతారా అన్నది కూడా ప్రచారంలో ఉన్న మరో వార్త. ఆయన ఇటీవల జరిగిన పరిషత్తు ఎన్నికల్లో తన కోడలుని గరివిడి నుంచి పోటీకి పెట్టి ఓటమిని చూశారు. దాంతో పాటు ఆయన 2029 నాటికి పోటీ చేయరని ఆయన కుమారుడి కోసం సీటు కోరుతారు అని అంటున్నారు. కానీ బొత్స మీద కిమిడి ఫ్యామిలీ పోటీకి దిగితే ఇబ్బంది అవుతుందని అందుకే చిన్న శ్రీను వంటి దిగ్గజాన్నే రంగంలోకి దింపుతారు అని అంటున్నారు. అదే కనుక జరిగితే మామ మేనల్లుడు ఒకే చోట నుంచి డైరెక్ట్ ఫైట్ కి సిద్ధపడతారు అని అంటున్నారు. అపుడు జిల్లాలోనే కాదు ఏపీలోనే చీపురుపల్లి హాట్ సీటు అవుతుందని కూడా అంచనా కడుతున్నారు. మొత్తానికి చూస్తే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన చిన్న శ్రీను స్థానిక సంస్థల ఎన్నికల్లో తన సత్తా చాటి తిరుగులేని విజయాన్ని టీడీపీకి దక్కించారు అన్నది హైకమాండ్ కి ఉందని అందుకే ఆయనకు పార్టీలో మరింత ప్రాధాన్యత ఇస్తారని అంటున్నారు.

జగన్ డెసిషన్...కాంగ్రెస్ కి భారీ షాక్ !

వైసీపీ అధినేత వైఎస్ జగన్ జాతీయ రాజకీయాలపై తన వైఖరిని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో చేరే ప్రసక్తే లేదని సంకేతాలిచ్చారు. అదే సమయంలో అంశాల ఆధారంగా ఎన్డీయేకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇస్తూనే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకూడదని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వైసీపీ తన డిమాండ్‌ను వెల్లడించింది.ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్ తాజాగా తీసుకున్న ఒక నిర్ణయంతో చాలా కాలంగా జరుగుతున్న ఒక ప్రచారానికి చెక్ పెట్టేశారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ పెద్దన్న ఉన్న ఇండియా కూటమిలో చేరే ప్రసక్తే లేదని తేల్చేశారు. అంతే కాదు తన న్యూట్రల్ స్టాండ్ ని కాపాడుకుంటూనే అవసరం అయిన సందర్భాలలో కచ్చితంగా ఎన్డీయేకు మద్దతుగా నిలుస్తాను అన్న కీలకమైన సందేశాన్ని ఇచ్చారు. జగన్ కాంగ్రెస్ తో జట్టు కట్టబోతున్నారు అని ఆయన బీజేపీకి దూరం జరిగారు అంటూ ఇటీవల వరసగా వార్తలు వచ్చాయి. అయితే జగన్ బీజేపీకి ఎపుడు దగ్గరగా ఉన్నారు అని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆయన ఇష్యూస్ బేస్డ్ గానే బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు అని గుర్తు చేస్తున్నారు.

విస్తృత ప్రయోజనాల కోసం :

ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం ఈ నెల 30న లోక్ సభలో ప్రవేశపెట్టబోతున్న డీలిమిటేషన్ బిల్లుకు వైసీపీ మద్దతు ఇస్తోంది అని అంటున్నారు. ఈ బిల్లు ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగరాదు అన్నది వైసీపీ స్టాండ్. అదే విధంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి అన్నది కూడా తమ పార్టీ విధానం అని వైసీపీ చెప్పుకొచ్చింది. ఏప్రిల్ లో ఈ బిల్లు ప్రవేశపెట్టినపుడు కూడా వైసీపీ మద్దతుగా నిలిచింది. ఇపుడు అదే చేసింది అని అంటున్నారు. ఒక విధంగా వైసీపీ ఈ బిల్లుకు మద్దతు తెలపడం ద్వారా మహిళా ఓటర్ల మద్దతుని అందుకోవాలని చూస్తోంది అంటున్నారు. ఇక డీలిమిటేషన్ వల్ల పెరిగే నియోజకవర్గాలు తమకు కూడా రాజకీయంగా ఉపయోగపడతాయని లెక్క వేసుకుంటోంది.

కాంగ్రెస్ కి దూరమే :

ఈ బిల్లు సంగతి పక్కన పెడితే వైసీపీ కాంగ్రెస్ విషయంలో తన స్టాండ్ ఏంటో చెప్పకనే చెప్పేసింది అని అంటున్నారు. ఈ బిల్లుని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. అదే సమయంలో ఇండియా కూటమిలోని పార్టీలతో ఒక కీలక సమావేశాన్ని కూడా ఆ పార్టీ ఏర్పాటు చేస్తోంది. ఇంకో వైపు చూస్తే ఈ మధ్య రాహుల్ గాంధీ బలం పెరిగిందని ఆయన గ్రాఫ్ ఒక్కసారిగా



ఎగబాకింది అని ప్రచారం సాగుతోంది. 2029 నాటికి రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని బీజేపీ బలం తగ్గిపోయిందని కూడా వార్తా కథనాలు వస్తున్నాయి. దాంతో ఏపీలో వైసీపీ కూడా కాంగ్రెస్ వైపు మళ్ళుతుందని అంటూ ప్రచారం చేస్తూ వచ్చారు. అయితే తాజా నిర్ణయంతో తాను దూరమే అని జగన్ చెప్పేశారు అంటున్నారు.

అది అయ్యేది కాదా :

కానీ జగన్ తాజాగా రాయలసీమ లిఫ్ట్ స్కీమ్ గురించి మాట్లాడుతూ చేసిన ట్వీట్ లో కాంగ్రెస్ చంద్రబాబుల మధ్య హాట్ లైన్ దోస్తీ సాగుతోంది అని ఆరోపించారు. ఆ మాటలు ఆయన గతంలో కూడా అన్నారు. ఒక విధంగా కాంగ్రెస్ ఏపీలో విపక్ష పాత్ర పోషించడం లేదు అన్నది వైసీపీలో బలంగా భావన ఉంది. ఏపీలో ఓట్ల చోరీ మీద మాట్లాడడం లేదని ఈ మధ్య జరిగిన స్థానిక ఎన్నికల్లో ఘర్షణలు జాతీయ మీడియా హైలెట్ చేసినా ఎక్కడా రాహుల్ ఆ ప్రస్తావన తేలేదని వైసీపీ అంటోంది. అలాంటి పార్టీతో కలవడం అన్నది ఉండదని కూడా చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే డీలిమిటేషన్ బిల్లు విషయంలో వైసీపీ ఏమి చేయబోతుంది అని ఇప్పటిదాకా అంతా చర్చనుకున్నారు. కానీ వైసీపీ అయితే తన స్టాండ్ ని మార్చుకోలేదని స్పష్టం అయింది. ఒక విధంగా జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగింది అని అంటున్నారు కానీ కొత్త మిత్రులను ఇండియా కూడగట్టలేకపోతోంది ప్రత్యేకించి ఏపీలో అన్ని విధాలుగా భావసారూప్యత ఉన్న వైసీపీని కలుపుకుని పోయే విషయంలో రాహుల్ గాంధీ ఇగోలకు పోతున్నారని అందుకే ఈ దూరం అలాగే సాగుతోందని అంటున్నారు.

పెన్ పవర్

రహానే రిటైర్మెంట్.. కోల్‌కతా పగ్గాలు రింకూ చేతికేనా? మాజీ క్రికెటర్ల విశ్లేషణ!

రహానే రిటైర్మెంట్‌తో కేకేఆర్‌లో ఖాళీ అయిన సారథి స్థానం

జట్టు యాజమాన్యం రింకూ వైపే మొగ్గుచూపుతుందన్న ఇర్ఫాన్ పఠాన్

గత సీజన్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నందున రింకూకే ప్రాధాన్యమన్న చోప్రా

కామెరాన్ గ్రీన్‌ను రూ.25.20 కోట్లకు రిటైన్ చేయడంపై చర్చ

డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనున్న ఐపీఎల్ మినీ వేలం



భారత స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ ఐపీఎల్ 2027 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయని మాజీ పేసర్ ఇర్ఫాన్ పఠాన్ పేర్కొన్నాడు. అజింక్య రహానే క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్మెంట్ ప్రకటించడంతో కేకేఆర్‌లో సారథి స్థానం ఖాళీ అయింది. డిసెంబర్ 16న గోవా వేదికగా జరగనున్న మినీ వేలానికి ముందే జట్టు నాయకత్వంపై చర్చ జోరందుకుంది.జియోస్టార్‌తో మాట్లాడిన ఇర్ఫాన్ పఠాన్, ప్రస్తుత కేకేఆర్ జట్టులో నాయకత్వ అనుభవం ఉన్న ఆటగాళ్ల కొరత ఉందని తెలిపాడు. వేలంలో వెస్టిండీస్ కెప్టెన్ షాయ్ హోప్ వంటి ఆటగాడిని కొనుగోలు చేసి పగ్గాలు అప్పగించే అవకాశం ఉన్నప్పటికీ, జట్టు యాజమాన్యం ఆలోచనా సరళిని బట్టి చూస్తే రింకూ సింగ్‌కే కెప్టెన్సీ పగ్గాలు దక్కవచ్చని విశ్లేషించాడు. రహానే నిష్క్రమణతో రఘువంశీ ఓపెనర్‌గా వచ్చే వెసులుబాటు దక్కుతుందని, హర్షిత్ రాణా ఫిట్‌నెస్ సాధించి బౌలింగ్‌కు సిద్ధమవడం జట్టుకు కలిసొచ్చే అంశమని చెప్పాడు.మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా సైతం రింకూ సింగ్ పేరును సమర్థించాడు. గత సీజన్‌లో కేకేఆర్ వైస్ కెప్టెన్‌గా

ఉన్న రింకూకు ఇప్పుడు సారథ్య బాధ్యతలు ఇవ్వడమే సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డాడు. అనుభవజ్ఞుడైన సునీల్ నరైన్ కూడా తాత్కాలిక ఎంపికగా ఉపయోగపడగలడని సూచించాడు. మరోవైపు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను రూ. 25.20 కోట్ల భారీ ధరకు అట్టిపెట్టుకోవడంపై చోప్రా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. గ్రీన్‌ను విడుదల చేసి ఉంటే వేలంలో రూ.41 కోట్ల కంటే ఎక్కువ పర్స్‌తో దిగే వెసులుబాటు దక్కేదని, యాషెస్ సిరీస్ నేపథ్యంలో గాయాల బారిన పడి గ్రీన్ లభ్యతపై అనుమానాలు ఉన్నాయని గుర్తుచేశాడు. జట్టుకు ఇంకో ఫాస్ట్ బౌలర్, మిడిలార్డర్ బ్యాటర్ అవసరమని మాజీ బ్యాటర్ అభినవ్ ముకుంద్ పేర్కొన్నాడు.

తండ్రిగా మారాక నాలో వచ్చిన మార్పు అదే



టీమిండియా కెప్టెన్, హిట్ మ్యాన్ రోహిత్ శర్మ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. తండ్రి అయిన తర్వాత తనలో వచ్చిన మార్పుల గురించి, అభిమానుల పట్ల తనకున్న గౌరవం గురించి మనసు విప్పి మాట్లాడాడు. సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారమయ్యే 'ఫ్యామిలీ ఫుల్ హౌస్' అనే కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న రోహిత్, అభిమానుల మనసు గెలుచుకునేలా వ్యాఖ్యలు చేశాడు.ఈ కార్యక్రమంలో సుభాష్ అనే కంటెస్టెంట్, "మీరు క్రికెట్ ఆడుతూనే తండ్రి అయ్యారు కదా. క్రికెట్ మీకు తండ్రిగా ఏం నేర్పించింది?" అని రోహిత్‌ను ప్రశ్నించారు. దీనికి రోహిత్ సమాధానమిస్తూ, "క్రికెట్ ఆడేటప్పుడు కోపం రావడం సహజం. కానీ, ఇంటికి వెళ్లాక మాత్రం ఒకటి రెండు నిమిషాల్లోనే నా కోపాన్ని అదుపులో ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాను. ఈ మార్పు నాన్న అయ్యాకే నాలో వచ్చింది. సహనాన్ని నేను తండ్రి అయ్యాకే నేర్చుకున్నాను" అని తెలిపాడు.ఈ సంభాషణ సందర్భంగా, కంటెస్టెంట్ సుభాష్ ఒక పాత సంఘటనను గుర్తు చేసుకున్నారు. "సార్, ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఇండియా-న్యూజిలాండ్ మ్యాచ్ జరుగుతున్నప్పుడు మీరు బౌండరీ లైన్ దగ్గర నిలబడి ఉన్నారు. నేను మీ వెనకే ఉన్నాను. అప్పుడు మీరు ఒక దివ్యాంగ అభిమానితో ఎంతో ఆప్యాయంగా మాట్లాడటం చూశాను. ఆరోజు మిమ్మల్ని కలవలేకపోయాను, కానీ ఈరోజు ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి మిమ్మల్ని కలవడానికే వచ్చాను" అని చెప్పారు.ఈ మాట వినగానే రోహిత్ వెంటనే ఆ ఘటనను గుర్తు చేసుకున్నాడు. "అవును, నాకు బాగా గుర్తుంది. అతను టీమిండియాకు చాలా పెద్ద అభిమాని. చాలా మ్యాచ్‌లకు వస్తుంటాడు. అలాంటి స్థితిలో కూడా జట్టును ప్రోత్సహించడానికి వచ్చినప్పుడు, మాకు కూడా సంతోషంగా ఉంటుంది. అలాంటి వ్యక్తికి మా సమయం నుంచి ఓ రెండు నిమిషాలు కేటాయించలేమా?" అంటూ తన ఉదారతను చాటుకున్నాడు. అభిమానుల గురించి రోహిత్ మాట్లాడుతూ.. "అభిమానులు లేకపోతే ఈ ఆటే లేదు. స్టేడియానికి వచ్చే ప్రతీ అభిమానికి మేం ఎంతో గౌరవం ఇస్తాం. ఎందుకంటే, వాళ్లు ఎన్ని కష్టాలు పడి మ్యాచ్ చూడటానికి వస్తారో నాకు తెలుసు. రైళ్లలో ప్రయాణించి, రద్దీలో ఇబ్బందులు పడి వస్తుంటారు. స్టేడియంలోకి వెళితే వేలాది మంది ఉంటారు, కొన్నిసార్లు కూర్చోవడానికి సీటు కూడా దొరకదు. అయినా గంటల తరబడి అలాగే ఉంటారు. ముఖ్యంగా ఇండియాలో ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వేడిలో కూర్చుని మ్యాచ్ చూసే వారి డెడికేషన్‌కు మేం ఎంతో విలువిస్తాం" అని వివరించాడు. రోహిత్ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల ప్రశంసలు అందుకుంటున్నాయి.

సులువైన క్యాచ్‌లు వదిలేస్తూ ఫైనల్ కలలా? భారత ఫీల్డింగ్ తీరుపై మాజీ స్టార్ క్రికెటర్ ఫైర్



న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో జరుగుతున్న రెండో టెస్టులో భారత ఆటగాళ్లు క్యాచ్‌లు చేజార్చడం వల్లే జట్టు పీకల్లోతు కష్టాల్లో పడిందని మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ దినేశ్ కార్తీక్ విమర్శించాడు. ఫీల్డర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరే అవకాశాలు భారత్ చేతులారా జారవిడుచుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 356 పరుగులు చేయగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ కేవలం 116 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఇంకా 240 పరుగుల భారీ లోటుతో ఉన్న భారత్‌కు ఫాలోఆన్ ముప్పు స్పష్టంగా కనిపిస్తోందని కార్తీక్ హెచ్చరించాడు. తన ఇన్‌స్టాగ్రామ్ వీడియో వేదికగా మాట్లాడిన ఈ మాజీ వికెట్ కీపర్ బ్యాటర్, టెస్ట్ ఆడే 12 దేశాల్లో క్యాచ్‌ల విభాగంలో భారత్ ప్రస్తుతం 8వ స్థానంలో ఉండటంపై తీవ్ర విస్మయం వ్యక్తం చేశాడు. సులువైన క్యాచ్‌లను సైతం నేలపాలు చేస్తూ, కీలక సమయాల్లో అవకాశాలను వదిలేస్తూ డబ్ల్యూటీసీ ఫైనల్ కలలు కనడం అసాధ్యమని స్పష్టం చేశాడు.న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో టామ్ లాథమ్ 29 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్ వదిలేయడంతో అతను 59 రన్స్ చేశాడని, అలాగే టామ్ బ్లండెల్ 49 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్ జారవిడవడంతో ఏకంగా 89 పరుగులు జోడించాడని గుర్తుచేశాడు. పేసర్ ఆకాశ్ దీప్ బౌలింగ్‌లోనే మూడు క్యాచ్‌లు నేలపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇతర జట్లు క్లోజ్-ఇన్ క్యాచ్‌లను అద్భుతంగా పడుతూ ఒత్తిడి పెంచుతుంటే, భారత ఫీల్డర్లు మాత్రం సులువైన అవకాశాలను వదిలేసి చేజేతులా ముప్పు కొనితెచ్చుకుంటున్నారని విమర్శించాడు. టాప్ ఆర్డర్ బ్యాటర్లు న్యూజిలాండ్ బౌలర్ల సీమ్, బౌన్స్‌కు తలొగ్గడంతో పాటు బాధ్యతారాహిత్యమైన షాట్లు ఆడి వికెట్లు సమర్పించుకున్నారని తెలిపాడు. కేఎల్ రాహుల్ అనవసర డ్రైవ్‌కు వెళ్లి ఔట్ కావడం, రిషభ్ పంత్ వికెట్ పారేసుకోవడం చర్చనీయాంశమైనా, పంత్ దూకుడు వైఖరిని మాత్రం సమర్థించాడు. మూడో రోజు తొలి సెషన్‌లో భారత్ వికెట్లు కోల్పోకుండా ఆడి లోటును కనీసం 150 పరుగులకు తగ్గించకపోతే మ్యాచ్‌లో పుంజుకోవడం అసాధ్యమని కార్తీక్ స్పష్టం చేశాడు.

కాకా.. ఓ క్లారిటీ వచ్చేసిందిగా..





చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కాకా' సంక్రాంతి విడుదలపై వస్తున్న వాయిదా ప్రచారానికి మేకర్స్ తెరదించారు. జనవరి 13న సినిమా విడుదల కానున్నట్లు షూటింగ్ స్పాట్ ఫొటోతో స్పష్టం చేశారు. త్వరలోనే ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇందులో అనస్వర రాజన్ చిరంజీవి కూతురిగా నటిస్తున్నారు. కొద్దిరోజులుగా మెగాస్టార్ చిరంజీవి సంక్రాంతి సినిమా 'కాకా' వాయిదా పడుతుందంటూ రకరకాల ప్రచారాలు నడుస్తున్నాయి. మరో సినిమా 'విశ్వంభర' కూడా పండగ రేసులోకి రావొచ్చనే టాక్ రావడంతో, 'కాకా' వెనక్కి తగ్గుతుందని అంతా అనుకున్నారు. కానీ మేకర్స్ లేటెస్ట్ గా రిలీజ్ చేసిన షూటింగ్ స్పాట్ ఫొటోతో ఆ రూమర్లకు ఫుల్ స్టాప్ పెట్టేశారు. జనవరి 13న 'కాకా' థియేటర్లలోకి రావడం పక్కా అని మరోసారి క్లారిటీ ఇచ్చారు.నిజానికి చిరంజీవికి సంక్రాంతి సీజన్ ఎప్పుడూ కలిసొచ్చే సెంటిమెంట్. ఈ ఏడాది పండక్కి అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' ఫ్యామిలీ ఆడియన్స్ ను బాగా ఆకట్టుకుని పెద్ద హిట్ కొట్టింది. ఆ సక్సెస్ ఇచ్చిన జోష్ తోనే చిరు ఇప్పుడు మళ్లీ అదే సంక్రాంతి బరిని టార్గెట్ చేశారు. వరుసగా రెండో ఏడాది కూడా పండగ బాక్సాఫీస్ పై కన్నేయడం మెగా ఫ్యాన్స్ లో మంచి కిక్ ఇచ్చింది.బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా మొదటి నుంచి పండగ టార్గెట్ తోనే రెడీ అవుతోంది. 2023 సంక్రాంతికి వీరిద్దరి కాంబినేషన్ లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. అప్పట్లో బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' నుంచి గట్టి పోటీ ఎదురైనా, మాస్ ఎలిమెంట్స్, వింటేజ్ చిరు మేనరిజమ్స్ తో బాబీ బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేశారు. నాలుగేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ అదే కాంబో సంక్రాంతికి రిపీట్ అవుతుండటం ఆసక్తికరంగా మారింది.అయితే 'వాల్తేరు వీరయ్య' తరహా రొటీన్ మాస్ ఫార్ములా కాకుండా, ఈసారి బాబీ కాస్త కొత్త రూట్ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే బయటకు వచ్చిన 'కాకా' గ్లింప్స్ లో చిరంజీవిని చాలా రఫ్ అండ్ ఇంటెన్స్ లుక్ లో చూపించారు. యాక్షన్ తో పాటు ఇందులో తండ్రీకూతుళ్ల సెంటిమెంట్ కూడా కీలకంగా ఉండబోతోందని సమాచారం. చిరు కూతురి పాత్రలో మలయాళ నటి అనస్వర రాజన్ నటిస్తున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. రిలీజ్ డేట్ విషయంలో ఎలాంటి మార్పు లేదని తేలిపోవడంతో, ఇక ప్రమోషన్ల స్పీడ్ పెంచేందుకు టీమ్ రెడీ అవుతోంది. ముందుగా మ్యూజిక్ ప్రమోషన్స్ మొదలుపెట్టే ప్లాన్ లో భాగంగా, ఫస్ట్ సింగిల్ అప్డేట్ ను అతి త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు. మరోవైపు 'విశ్వంభర' రిలీజ్ డేట్ పై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఏదేమైనా సంక్రాంతి రేసులో 'కాకా' దిగడం ఖాయమైపోయింది. గత పండక్కి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తో హిట్ కొట్టిన చిరంజీవి, ఈసారి మార్క్ యాక్షన్ ఎమోషనల్ డ్రామాతో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965